**నేటి కందం-నేటికి అందం**

భూమి వివాదములు నగర
సీమలలో తొలగి పోవ క్షేమంకరమా
స్వామిత్వ కార్డు లొసగెడి
ప్రాముఖ్యతతో ప్రకటన ప్రచురింప బడెన్ !!

(పట్టణ ప్రాంతాల్లో భూ వివాదాల పరిష్కారానికి "స్వామిత్వకార్డు" లను ప్రభుత్వం యివ్వడానికి నిశ్చయించి ప్రకటన జారీ చేసింది.)

-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

పవర్ కోత చుట్టుముట్టి
పడకవేసే బోరు బాయి
ప్రభుత్వం అశ్రద్ధతో
ప్రాజెక్టుల బతుకు గాయి.
నీరందక ఎండుతుంది
నేడు పెరిగే పైరు పంట
కన్నీరై గుండె చెదిరి
కారుతుంది రైతు కంట

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 18-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:270 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్..

# నగదు రహిత వైద్య సేవలు ప్రారంభం..



హైదరాబాద్, జులై 17:తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవలను ప్రారంభించింది. ఈ పథకాన్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఔఇఊూ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను ప్రారంభించారు. అలాగే ఇఊఅు ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు.

ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్ధిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెం టల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రు ల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు ప్రక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ఇఊఅు ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది.

దీని అమలు కోసం రాష్ట్ర ంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయను న్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్ ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తో అనుసంధానం చేయను న్నారు. దీని ద్వారా నాణ్యమై న, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందిం చే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

## బాలిస్టిక్ క్షిపణులతో దాడి..

# అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసం: ఐఆర్జీసీ




న్యూ ఢిల్లీ, జులై 17: ఇరాన్ భారీ దాడి చేసింది. అమెరికాకు చెందిన మిలిటరీ విమానాలను ధ్వంసం చేసింది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా బేస్‌పై అటాక్ జరిగింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. గత రాత్రి జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడినట్లు తెలుస్తోంది. ఆ దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌కు చెందిన సుమారు మూడు క్షిపణులను కూల్చినట్లు జోర్డాన్ మిలిటరీ వెల్లడించింది. ఇవాళ జరిగిన దాడి గురించి ఇరాన్స్ రెవల్యూషనరీ గార్డ్స్ ఓ ప్రకటన చేసింది. అమెరికా వైమానిక దళానికి చెందిన అనేక రీఫ్యూయలింగ్ విమానాలు, యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్లు ఐఆర్జీసీ తెలిపింది. సిరియాలో ఉన్న అల్ తానఫ్ అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్‌ను కూడా అటాక్ చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది.

వరుసగా ఆరో రోజు గురువారం రాత్రి అమెరికా వైమానిక దాడులు చేసింది. ఇరాన్ మౌళిక సదుపాయాలను టార్గెట్ చేసింది. ఆ దేశంలో ఉన్న అనేక బ్రిడ్జీలను నేలమట్టం చేసింది. అయితే ఈ దశలో ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. ఒకవేళ దాడులు ఉధృతం అయితే, అప్పుడు యావత్ పశ్చిమాసియా ప్రాంతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ తన హెచ్చరికలో పేర్కొన్నది. హర్మోజ్‌గన్ ప్రావిన్సులో జరిగిన దాడుల్లో అయిదు బ్రిడ్జీలను అమెరికా విమాన సిబ్బంది పేల్చేసింది. కీలకమైన బందర్ అబ్బాస్ పోర్టు నగరానికి లింకున్న బ్రిడ్జీలను కూల్చివేసినట్లు తెలుస్తోంది.

బహ్రెయిన్‌లోని సాకిర్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా హెలికాప్టర్లు, రికనయిసెన్స్ విమానాలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ చెబుతోంది. మరోవైపు అలారం సైరన్లు మోగించినట్లు బహ్రెయిన్ మంత్రి పేర్కొన్నారు. ప్రజలు సంయమనంతో ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. కానీ ఎయిర్‌బేస్ మీద అటాక్ జరిగినట్లు అమెరికా, బహ్రెయిన్ అధికారులు ఇంకా కన్ఫర్మ్ చేయలేదు.


ఆహ్వానం

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం
నవచేతన పబ్లిషింగ్ హౌస్
సంయుక్త ఆధ్వర్యంలో
డా.వేమకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్
గారిల సంపాదకత్వంలో రూపొందిన
'కొంపెల్ల జనార్ధనరావు జీవితం - సమగ్ర సాహిత్యం' గ్రంథం
ఆవిష్కరణ సభ

తేది: 19.07.2026 ఆదివారం
సమయం: ఉదయం 9:30 గం॥లకు
వేదిక: పైడి జయరాజ్ ఆడిటోరియం రవీంద్రభారతి భవన, జప అంతస్తు, హైదరాబాద్

సభాధ్యక్షులు : శ్రీ ఆర్వీ రామారావు, సంపాదకులు, విశాలాంధ్ర దిన పత్రిక
ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా. నందిని సిధారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, తొలి అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి

గౌరవ అతిథులు
శ్రీ వేల్పుల నారాయణ, అరసం జాతీయ కార్యదర్శి,
డా. విల్సారి మురళీధర్ రావు, ప్రముఖ కవి, విమర్శకులు, విశ్రాంత ఆచార్యులు
శ్రీ కందిమళ్ళ ప్రభాకరెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు, IPTA
శ్రీ మధుకర్, జనరల్ మేనేజర్, నవచేతన విజ్ఞాన సమితి

ఆత్మీయ అతిథులు
శ్రీ వల్లూరి శివప్రసాద్, ప్రముఖ నాటక రచయిత, ప్రధాన కార్యదర్శి, ఆం.ప్ర. అరసం
డా. జి.సి. వసంత, ప్రముఖ సాహితీ సాహితీవేత్త
శ్రీ యామిజాల ఆనంద్, పాత్రికేయులు, సాహితీ వేత్త
శ్రీ కొంపెల్ల కామేశ్వరరావు, ప్రముఖ కవి, విమర్శకులు
డా. పల్లేరు వీరస్వామి, అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

సహృదయులందరికీ ఇదే మా ఆహ్వానం

నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఫోన్ : 9948106008
తెలంగాణ అరసం ఫోన్ : 9441779688


### వరంగల్ నగరంలో భారీ వర్షం

వరంగల్, జులై 16: వరంగల్ నగరంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షాల ప్రభావంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.

# తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం






న్యూఢిల్లీ, జులై 17: దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది నిదర్శనమని కొనియాడారు.

ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నా గా ఉంటాయి.

పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

## స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు..

# ఇద్దరు విద్యార్థులతో సహా ముగ్గురు మృతి



కోల్‌కతా, జులై 17: రైల్వే క్రాసింగ్ వద్ద గేటు వేయకపోవడంతో స్కూల్ వ్యాన్ పట్టాలు దాటేందుకు ప్రయత్నించింది. ఇంతలో వేగంగా వచ్చిన రైలు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులతో సహా ముగ్గురు మరణించారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో కర్ణ సుబర్ణ రైల్వే స్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ వద్ద గోవిందాపూర్ రైల్ గేటు తెరిచి ఉన్నది. 10 మంది పిల్లలతో వెళ్తున్న బెర్హంపూర్‌లోని స్కూల్ వ్యాన్ రైలు పట్టాలను దాటేందుకు ప్రయత్నించింది. ఇంతలో వేగంగా వచ్చిన లోకల్ రైలు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు స్కూలు పిల్లలు, సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మరణించారు.

కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను తొలుత సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురు పిల్లలు, డ్రైవర్‌ను ముర్షిదాబాద్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లోని ఐసీయూలో చేర్చారు. ఆ తర్వాత గాయపడిన మిగిలిన విద్యార్థులను కూడా ఇక్కడకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు రైల్వే, గేట్‌కీపర్ నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో ఉన్న గేట్‌కీపర్ రైలు వచ్చే సమయంలో రైల్వే గేట్ వేయలేదని ఆరోపించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కోసం పది మంది సభ్యుల బృందాన్ని రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి పంపారు. రైల్వే, స్థానిక పోలీసులు కూడా ఈ సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదం కారణంగా తూర్పు రైల్వే హౌరా డివిజన్‌లోని అజీమ్‌గంజ్-కట్వా సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు, సేవలకు అంతరాయం ఏర్పడిందని రైల్వే అధికారి తెలిపారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా చూడాలి : తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, జులై 17: అమ్మవారి కల్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఈ నెల 21 వ తేదీన జరిగే అమ్మవారి కల్యాణం, 22 వ తేదీన నిర్వహించే రథోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

అనంతరం ఆలయ పండితులు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఇంచార్జి సూపరింటెండెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి కల్యాణాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లను చేయాలని చెప్పారు.

# యూఎస్ ఫైటర్ జెట్స్‌ను ధ్వంసం చేశాం: ఇరాన్ సైనిక దళం

న్యూఢిల్లీ, జులై 17: జోర్డాన్‌లోని వైమానిక స్థావరంలోగల పలు అమెరికా యుద్ధ విమానాలను ధ్వంసం చేశామని ఇరాన్ సైనిక దళం ఐఆర్‌జీసీ తాజాగా ప్రకటించింది. పలు ఎయిర్ రీఫ్యూలింగ్ విమానాలనూ ధ్వంసం చేశామని పేర్కొంది. ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే అడ్డుకున్నామని జోర్డాన్ ప్రకటించిన కాసేపటికే ఐఆర్‌జీసీ ఈ ప్రకటన చేసింది. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఈ దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. తమ దాడుల్లో పలు అమెరికన్ విమానాలు దెబ్బతిన్నాయని కూడా ఐఆర్‌జీసీ పేర్కొంది. అంతేకాకుండా, ఇస్లామ్ వ్యతిరేక అమెరికా ప్రయోజనాలను, అమెరికన్ ప్రజలను కూడా టార్గెట్ చేయాలని జోర్డాన్ ప్రజలకు ఐఆర్‌జీసీ పిలుపునిచ్చింది.

సిరియాలోని అల్ టాన్ఫ్‌లోగల యూఎస్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్‌పై కూడా తాము దాడి చేశామని ఐఆర్‌జీసీ పేర్కొన్నట్లు ఇరాన్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రకటనలపై సిరియన్ ప్రభుత్వం, అమెరికా మిలిటరీ ఇంకా స్పందించలేదు. సిరియా, జోర్డాన్, ఇరాన్ సరిహద్దులోని అల్ టాన్ఫ్ స్థావరాన్ని విడిచివెళ్లిపోయామని యూఎస్ ఫిబ్రవరిలోనే ప్రకటించింది. ఇదిలా ఉంటే గల్ఫ్ దేశాలను అతలాకుతలం చేస్తున్న ఈ యుద్ధం విషయంలో సిరియా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ ఘర్షణలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. సిరియాకు పొరుగున ఉన్న లెబనాన్‌లోని హెజ్‌బోల్లా మిలిటెంట్ సంస్థ ఇప్పటికే ఇజ్రాయెల్ దళాలతో పోరాడుతోంది. మరోవైపు, ఇరాన్ మద్దతు ఉన్న కొన్ని మిలిటెంట్ గ్రూపులు కూడా ఇరాన్ నుంచి దాడులు చేస్తున్నాయి.

గత నెలలో అమెరికా, ఇరాన్ మధ్య శాంతిస్థాపన కోసం కుదిరిన అవగాహన ఒప్పందం నిలిచిపోవడంతో మళ్లీ పరస్పర దాడులు మొదలైన విషయం తెలిసిందే. హోర్ముజ్‌పై నియంత్రణ కోసం ఇరు దేశాలు ఒకరిపైమరొకరు దాడులు చేసుకుంటున్నాయి. ఇటీవల కాలంలో అమెరికా ఇరాన్‌పై వైమానికదాడులను మరింత ఉధృతం చేసింది. ఇరాన్‌లోని మౌలిక వసతులే టార్గెట్‌గా దాడులను కొనసాగిస్తోంది. ముఖ్యంగా తీరప్రాంత నగరాలు, ద్వీపాలపై అమెరికా దాడులు జరుపుతోంది. అహ్వాజ్, కేషమ్, బుషెహర్, డాస్తీ, బోస్తాన్, సిరిక్, బందర్ ఏ లెంగే వంటి చోట్ల యూఎస్ దాడుల్లో మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. హోర్మోజ్గాన్ ప్రావిన్సులో జరిగిన దాడిలో రైల్వే, రోడ్డు రవాణా మౌలికవసతులు దెబ్బతిన్నాయి. ఏడుగురు మరణించారు. ఇరాన్‌షహర్‌లోని ఒక ఎయిర్‌పోర్టుపై కూడా దాడి జరిగినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యూఎస్ దాడుల్లో డజన్ల కొద్దీ జనాలు మరణించారని, వందల మంది గాయపడ్డారని ఇరాన్ మీడియా పేర్కొంది. శుక్రవారం జరిగిన దాడుల్లో కూడా పలువురు మరణించారని చెప్పింది.

# ఆసిఫాబాద్‌లో దారుణం: రైల్వే స్టేషన్ సమీపంలో వృద్ధుడి దారుణ హత్య

కొమురం భీం ఆసిఫాబాద్, జులై 17: జిల్లాలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వృద్ధుడిని గుర్తుతెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. నిందితులు వృద్ధుడి తలను, మొండాన్ని వేరు చేసి పడేయడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. పాత కక్షలా లేక మరేదైనా వివాదమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతుడు ఎవరు అనే విషయాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తూ విచారణను వేగవంతం చేశారు.

# బాలుడ్ని నోటకరుచుకుని.. నీటిలోకి లాక్కెళ్లిన మొసలి

లక్నో: నదీ తీరానికి వెళ్లిన ఒక బాలుడిపై మొసలి దాడి చేసింది. అతడ్ని నోటకరుచుకుని నీటిలోకి లాక్కెళ్లింది. పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది ఆ నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు.

ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 14న 12 ఏళ్ల బాలుడు తన మేనమామతో కలిసి ఘఘ్రా నది సమీపంలోని పొలానికి చేరుకున్నాడు. కొంత సమయం తర్వాత మల విసర్జన కోసం నది ఒడ్డుకు వెళ్లాడు.కాగా, నది తీరంలో మాటు వేసి ఉన్న మొసలి ఆ బాలుడిపై దాడి చేసింది.

అతడి అరుపులు విన్న మేనమామ నది ఒడ్డుకు పరుగున వచ్చాడు. ఆ బాలుడ్ని రక్షించేందుకు ప్రయత్నించాడు. అయితే మొసలి అతడ్ని నోటకరుచుకుని నదిలోకి లాక్కెళ్లి నీటిలో మాయమైంది.

# జాతి వివక్ష పోరాట యోధుడు నెల్సన్ మండేలా

## (18 జూలై "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం" సందర్భంగా)

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సి) నాయకుడు, దాణశీలి, ప్రజాసేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు (1994-99), 27 ఏండ్ల పాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18 జూలై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జూలై రోజున "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలా"ను పాటించడం 18 జూలై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని "మ్వోజో" గ్రామంలోని "తెంబూ రాయల్" కుటుంబంలో జన్మించిన మండేలా వంశంలో తొలి విద్యావేత్తగా పోర్ట్‌హేర్, విట్‌వాటర్‌స్రాండ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్నత విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్‌లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్‌ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది. అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం-2026 ఇతివృత్తంగా "పేదరికం, అసమానతల నిర్మూలన ఇప్పటికీ మన చేతుల్లోనే ఉన్నది" అనే అంశాన్ని ఎంపిక చేశారు.

### ఉద్యమాలే ఊపిరిగా సాగిన జీవితం:

1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఏఎన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మర్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ "ఉమ్కొంటో వీ స్విజ్వే" అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేత జాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963 రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్ల పాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండేలా సంఖ్యగా పిలవబడం జరుగుతోంది.

### తొలి నల్లజాతి దక్షిణ ఆఫ్రికా దేశాధ్యక్షుడు:

విడుదల అనంతరం నాటి శ్వేతజాతి ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఏఎన్‌సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు. వర్ణ వివక్షను రూపుమాపే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూసంస్కరణలు, పేదరిక నిర్మూలన, స్వపరిపాలనలకు పట్టం కట్టిన మండేలా నల్లజాతి ఉద్ధారకుడిగా చరిత్రలో నిలిచిపోయారు. 1998-99 మధ్య అలీనోద్యమం సెక్రెటరీ జనరల్‌గా విశిష్ట సేవలు అందించారు. రెండవ దఫా అధ్యక్షుడిగా సేవలు అందించడాన్ని ఇష్టపడకుండా తన పేరున ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పేదరిక నిర్మూలన, హెచ్‌ఐవి-ఏయిడ్స్ వ్యతిరేక పోరాటాలు చేశారు.

### ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం - మండేలా జీవితం:

"అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం" సందర్భంగా పేదరిక నిర్మూలన కేంద్రంగా అన్నదాన కార్యక్రమాలు, వృద్ధుల పట్ల ఆదరణ, యువతకు ప్రేరణాత్మక కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవలు, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. వర్ణ సమానత్వం, స్వేచ్ఛాయుత పౌర సమాజం, సమానావకాశాల కల్పన, సుహృద్భావ వాతావరణం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అందరికీ అందుబాటులో విద్య లాంటి కనీస అంశాలకు అంకితభావంతో సేవలు అందించిన నల్లజాతి వెలుగుల సూరీడు మండేలా నేటి యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తూ, భవిష్యత్తుకు దారులు చూపే దారి దీపం అవుతున్నారు. "ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం" అనబడే పేరుతో ఆత్మకథను రాసిన మండేలాను "దక్షిణ ఆఫ్రికా గాంధీ"గా పిలవడం సముచితంగా వుంది. మండేలా 67 ఏండ్ల జీవితాన్ని ప్రేరణగా తీసుకొని 67 నిమిషాలు ప్రజాహిత సేవలో అందరం గడిపి ఆయనకు అసలైన నివాళి అర్పించాలి.

సామాజిక న్యాయమే ఊపిరిగా జీవించిన ప్రజాస్వామ్య జ్యోతి మండేలాను భారత రత్న, నోబెల్ శాంతి బహుమతి, దక్షిణాఫ్రికా జాతి పిత, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య పురస్కారం లాంటి 250కి పైగా పురస్కారాలు ఆయన్ని వరించి మురిసి పోయాయి. ప్రతిష్టాత్మక 'మడిబా' అనే బిరుదును పొందిన మండేలా 05 డిసెంబర్ 2013న తుది శ్వాస విడిచారు.



-మధుపాళీ
9949700037

# భవిష్యత్తులో జరిగే సాంకేతిక యుద్ధాల్లో సరిహద్దు మౌలిక సదుపాయాలే అత్యంత కీలకం

## - బీఆర్ఓ వ్యూహాత్మక మౌలిక సదుపాయాల సదస్సులో రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, జులై 17:"యుద్ధ స్వభావంలో వస్తున్న మార్పుల కారణంగా తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ దళాల్లోకి అత్యాధునిక ఆయుధాలు, అధునాతన వేదికలను ప్రవేశపెడుతున్నప్పటికీ.. భవిష్యత్తులో ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, టన్నెల్స్ అత్యంత కీలక పాత్రను పోషిస్తూనే ఉంటాయి" అని రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 2026 జూలై 16న న్యూఢిల్లీలో జరిగిన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (సరిహద్దు రహదారుల సంస్థ- బీఆర్ఓ) వ్యూహాత్మక మౌలిక వసతుల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. యుద్ధ ఫలితాన్ని సైనిక పరాక్రమం, ఖచ్చితత్వ సామర్థ్యాలు, ఆధునిక సాంకేతికతలు నిర్ణయించినప్పటికీ, సైనిక కార్యకలాపాలను సులభతరం చేయడంలో ప్రాథమిక మౌలిక సదుపాయాలే కీలకమని పేర్కొన్నారు.

"కొన్నిసార్లు యుద్ధం సరిహద్దు వద్దనే నేరుగా జరగకపోవచ్చు. సైనికులను తీసుకెళ్లే రహదారిపై కూడా ప్రారంభమవుతుంది. అందుకే ఆ రహదారిని నిర్మించే వ్యక్తి కూడా సరిహద్దులో నిలిచే సైనికుడితో సమానంగా జాతీయ భద్రతను కాపాడే అత్యంత కీలకమైన సంరక్షకుడు" అని రక్షణశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. పటిష్టమైన మౌలిక సదుపాయాల స్థాపనకు బీఆర్ఓ అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించడాన్ని ఆయన అభినందించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల నిర్మాణం, జాతీయ భద్రత నిరంతర బలోపేతం, 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ సంకల్పాన్ని బీఆర్ఓ ముందుకు తీసుకెళ్తోందని ప్రశంసించారు.

గడిచిన ఆరున్నర దశాబ్దాలుగా బీఆర్ఓ కేవలం రహదారుల నిర్మాణ సంస్థ స్థాయి నుంచి ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రదమైన వ్యూహాత్మక మౌలిక వసతుల సంస్థల్లో ఒకటిగా ఎదిగిందని రక్షణశాఖ మంత్రి కొనియాడారు. అటల్ టన్నెల్, ఉమ్లింగ్ లా పాస్, సెలా టన్నెల్ వంటి అద్భుత విజయాలు బీఆర్ఓ సామర్థ్యానికి, కఠోర శ్రమకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయని పేర్కొన్నారు. దేశ సేవ పట్ల అంకితభావం ఉంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా, ఏ సవాలునైనా అధిగమించవచ్చని ఈ సంస్థ సిబ్బంది పదేపదే నిరూపించారని తెలిపారు.

ఆధునిక సాంకేతికతలను అవలంబించడంలో బీఆర్ఓ అగ్రగామి సంస్థగా నిలిచిందని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. నగరాల్లో మెట్రో నిర్మాణం నుంచి పర్వత ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి వరకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన 'సొరంగాల సాంకేతికత' గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోనే అత్యంత సవాలుతో కూడిన భూభాగాల్లో బీఆర్ఓ రోడ్లు, రహదారులను నిర్మిస్తున్న వేగం అసాధారణమైనదని తెలిపారు. ఇది మానవ సంకల్పం, ఆధునిక సాంకేతికతల సమష్టి బలానికి నిదర్శనమని అన్నారు. నాగరికత అభివృద్ధికి 'అనుసంధానం' అత్యంత ముఖ్యమైన అంశమని రక్షణ మంత్రి అభివర్ణించారు. రహదారులు, రైలు, వైమానిక, డిజిటల్ మౌలిక వసతుల ద్వారా అన్ని రకాల అనుసంధానాన్ని అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన ప్రస్తావించారు. "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మౌలిక వసతులపై పెట్టిన శ్రద్ధ దేశ సామర్థ్యాలకు, అవసరాలకు తగినట్లుగా లేదు.. మారుమూల ప్రాంతాల్లో నివసించే ఏ పౌరుడూ తాము అభివృద్ధికి దూరమయ్యామనే భావనకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒకప్పుడు చివరి గ్రామాలుగా పిలిచే సరిహద్దు గ్రామాలను 'వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్' కింద దేశంలోనే మొదటి గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నాం. బలమైన మౌలిక వసతులు ఉన్న దేశానికే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. నేడు మనం నిర్మిస్తున్న మౌలిక వసతులే రాబోయే ఒకటి, రెండు శతాబ్దాల పాటు మన నాగరికతను నిర్వచిస్తాయి" అని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అదొక సమష్టి కృషి అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సరికొత్త ఆవిష్కరణలు చేయడానికి పరిశ్రమలు, పరిశోధనల్లో ముందుకు సాగడానికి విద్యాసంస్థలు, నూతన పరిష్కారాలను కనుగొనడానికి ఇంజనీర్లు, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి పరిపాలనాధికారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "ప్రతీ భాగస్వామి అత్యంత అంకితభావంతో తమ పాత్రను పోషిస్తూ, అత్యుత్తమ పనితీరును ప్రోత్సహించే ఒక అద్భుతమైన వ్యవస్థను మనమందరం కలిసి నిర్మించాల్సి ఉంది" ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా సరిహద్దు రహదారుల సంస్థ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్ మాట్లాడుతూ... వ్యూహాత్మక సామర్థ్యానికి కొలమానం ఇకపై మనం దేన్ని నిర్మిస్తున్నామనే దానిపైనే కాకుండా ఎంత ప్రణాళికాబద్ధంగా చేస్తున్నాం, ఎంత వేగంగా అమలు చేస్తున్నాం, ఎంత సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్నాం, ఎంత సుస్థిరంగా మౌలిక వసతులను నిర్వహిస్తున్నామనే దానిపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణలు, సంస్థాగత సంస్కరణల ఆధారంగా బీఆర్ఓ ఒక సరికొత్త పరివర్తన ప్రయాణాన్ని ప్రారంభించిందని తెలిపారు. స్థితిస్థాపకత కలిగిన, భవిష్యత్తు అవసరాలకు తగిన వ్యూహాత్మక మౌలిక వసతులను నిర్మించడానికి డిజిటల్ ప్రణాళిక, కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలు, ఆధునిక నిర్మాణ పద్ధతులు, యాంత్రీక ం ఇ, పరిశ్రమలు, విద్యాసంస్థలతో బలమైన భాగస్వామ్యాలపై దృష్టి సారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధిలో అద్భుతమైన పనితీరు, ప్రతిభ కనబరిచిన వివిధ బీఆర్ఓ ప్రాజెక్టులకు రక్షణశాఖ మంత్రి అవార్డులను ప్రదానం చేశారు. బీఆర్ఓ డిజిటల్ పరివర్తన, సంస్థాగత ఆధునికీకరణలోమరో కీలక అడుగు వేస్తూ ప్రాజెక్టు నిర్వహణ, నియామకాల కోసం రూపొందించిన రెండు సరికొత్త డిజిటల్ వేదికలను ఆయన ప్రారంభించారు.

సంస్థ సాధించిన విజయాలు, ఇంజనీరింగ్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులు, భవిష్యత్తు దార్శనికతను పొందుపరిచిన 'పథ్ ప్రదర్శక్', 'ఊంచీ సడ్కెన్', 'పథ్ వికాస్' అనే మూడు ప్రతిష్ఠాత్మక బీఆర్ఓ ప్రచురణలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. బీఆర్ఓ కర్మయోగుల అచంచలమైన స్ఫూర్తికి, నిరంతర అంకితభావానికి, నిస్వార్థ సేవకు నివాళిగా ఈ కార్యక్రమంలో బీఆర్ఓ అధికారిక గీతాన్ని కూడా ఆవిష్కరించారు.

జూలై 15, 2026న ప్రారంభమైన ఈ రెండు రోజుల సదస్సు.. దేశ సరిహద్దు ప్రాంతాల్లో వ్యూహాత్మక మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడానికి అద్భుతమైన వేదికగా నిలిచింది. ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా సరికొత్త సాంకేతికతలు, వినూత్న ఇంజనీరింగ్ పరిష్కారాలు, ప్రణాళికా రచనలో డిజిటల్ పరివర్తన, ప్రాజెక్టుల పర్యవేక్షణ, అమలు, సుస్థిర నిర్మాణ పద్ధతులు, ఉత్తమ పద్ధతులపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ సైనిక నాయకత్వం, విధాన రూపకర్తలు, మౌలిక వసతుల నిపుణులు, బీఆర్ఓ అధికారులు, పారిశ్రామిక వేత్తలు, సాంకేతిక భాగస్వాములు ఈ వేదికపైకి చేరి, వ్యూహాత్మక మౌలిక వసతుల అభివృద్ధి భవిష్యత్తుపై సమష్టిగా చర్చించారు.

వ్యూహాత్మక మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక, రూపకల్పన నుంచి అమలు, పర్యవేక్షణ, భవిష్యత్తు సాంకేతికతలను అవలంబించడం వరకు ప్రతీ దశను చేరుస్తూ విభిన్న నేపథ్య ఆధారిత సమావేశాలుగా ఈ సదస్సును నిర్వహించారు. భవిష్యత్తు వ్యూహాత్మక మౌలిక వసతుల అభివృద్ధికి ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనే లక్ష్యంతో.. "సాంకేతికత, ఆవిష్కరణలు, అద్భుతమైన పనితీరు ద్వారా సామర్థ్యం పెంపు' ఇతివృత్తంతో ప్రతి సమావేశంలోనూ విస్తృత చర్చలు జరిగాయి.


ఆహ్వానం





వేముల సత్యనారాయణ రచన
నేనూ... నా ప్రపంచం
ఉద్యోగ ప్రస్థానం
(యాభై రెండేళ్ల డైరీ కథనం)
పుస్తకావిష్కరణ సభ
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
జులై 19, 2026 ఆదివారం ఉ. 10 గం.లకు
సభాధ్యక్షులు :
అన్నవరం దేవేందర్, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
ముఖ్య అతిథి-ఆవిష్కర్త :
డా. మచ్చ హరిదాసు, కవి, రచయిత
విశిష్ట అతిథులు :
డా. నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
జూకంటి జగన్నాథం, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
పెద్దింటి అశోక్ కుమార్, కథా, నవలా సినీ రచయిత
పుస్తక సమీక్ష :
డా. బి.వి.ఎన్.స్వామి, కథారచయిత, విమర్శకుడు
ఆత్మీయ అతిథులు :
బూర్ల వేంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కవి, రచయిత
అన్నాడి గజేందర్ రెడ్డి, కవి, విమర్శకులు, గాయకులు
కూకట్ల తిరుపతి, సభా సమన్వయం
9949247591
సాహితీ సోపతి
కరీంనగర్, తెలంగాణ


# అర్హులకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం..

ఆదిలాబాద్, జులై 17: రాజకీయాలు, పార్టీల అనుబంధాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ధ్యేయమని బెల్లాల్ గ్రామ సర్పంచ్ బొంతల లక్ష్మీ భూమన్న యాదవ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గొల్ల వెంకటేష్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చెన్ను మల్లేష్ యాదవ్ లు పేర్కొన్నారు. శుక్రవారం కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామంలో విలక్షణమైన, హుందాతనంతో కూడిన కార్యక్రమం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బీజేపీ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ ఎల్లపు అనూష భర్త శ్రీనివాస్‌కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును సర్పంచ్ బొంతల లక్ష్మీ భూమన్న, డీసిసి మెంబర్ గొల్ల వెంకటేష్ అందజేశారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వంచతి శ్రీనివాస్ యాదవ్ నాయకులు శ్రీనివాస్ కమటాల రవి గిరవేణి సత్తన్న పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలందరూ ఒక్కటేనని, సంక్షేమ పథకాల పంపిణీలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేదని వారు స్పష్టం చేశారు.

# కొచ్చిలోని సదరన్ నేవల్ కమాండ్‌లో ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2 నిర్వహిస్తున్న భారత నావికాదళం

న్యూఢిల్లీ, జులై 17:2026 జులై 20 నుంచి 23 వరకు కొచ్చిలోని సదరన్ నేవల్ కమాండ్‌లో ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2ను భారత నేవీ నిర్వహించనుంది. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ బహుళజాతి శిక్షణ కార్యక్రమాన్ని కంబైన్డ్ మారిటైమ్ ఫోర్సెస్ (సీఎంఎఫ్) భాగస్వామ్యంతో చేపడుతున్నారు. సీఎంఎఫ్ ప్రత్యేక శిక్షణ విభాగమైన, భారత నావికాదళ నేతృత్వంలోని కంబైన్డ్ టాస్క్ ఫోర్స్ 154 (సీటీఎఫ్ 154) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

వృత్తిపరమైన సముద్ర భద్రతా శిక్షణకూ, ప్రయోగాత్మక అనుభవానికీ, ఉత్తమ పద్ధతులను ఇచ్చిపుచ్చుకోవడానికీ... సీఎంఎఫ్ భాగస్వామ్య దేశాల సిబ్బందిని ఈ కార్యక్రమం ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. 40కి పైగా దేశాలతో కూడిన బహుళ జాతీయ సముద్ర భాగస్వామ్య సంస్థ అయిన సీఎంఎఫ్ సహకారంతో... ప్రాంతీయంగా సామర్థ్య నిర్మాణానికి, సామూహిక సముద్ర భద్రతకు భారత నౌకాదళం తన వంతు సహకారాన్ని అందిస్తుంది.

బోధన, సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ, ప్రయోగాత్మక అనుభవం ఈ శిక్షణలో భాగంగా ఉంటాయి. ఈ సెషన్లలో సముద్ర చట్టాలు, సముద్ర రంగంపై అవగాహన, సమాచార వినిమయం, మాదక ద్రవ్యాలను అరికట్టడం, బలగాల పరిరక్షణ, అనూహ్య దాడులు, మానవ రహిత సముద్ర వ్యవస్థలు, తదితర అంశాల గురించి వివరిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి నష్ట నివారణ, అగ్నిమాపకం, మ్యారిటైమ్ కమ్యూనికేషన్లు, సముద్రంలో ప్రాణరక్షణ, బోర్డింగ్ విధానాలపై శిక్షణ ఇస్తారు. అలాగే, భారతీయ నౌకాదళానికి చెందిన నౌకలో ప్రత్యేక శిక్షణ పొందుతారు.

భారతీయ నౌకాదళం అందించే ఆధునిక శిక్షణ సదుపాయాలు, అత్యాధునిక సిమ్యులేటర్లు, అధునాతన బోధనా పద్ధతులు, వృత్తిపరమైన అనుభవాన్ని ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2 ప్రదర్శిస్తుంది. బోధనను ఆచరణాత్మక అనువర్తనంతో అనుసంధానించడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనే దేశాల మధ్య పరస్పర కార్యాచరణ సామర్థ్యాన్నీ, వృత్తిపరమైన అవగాహననూ, సహకారాన్నీ పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

కొచ్చిలోని సదరన్ నేవల్ కమాండ్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం.. బహుళ దేశాల నావికా దళ శిక్షణలో పెరుగుతున్న భారతీయ నౌకాదళ సహకారాన్ని తెలియజేస్తుంది. అలాగే అత్యుత్తమ శిక్షణ కేంద్రంగా సదరన్ నేవల్ కమాండ్ పాత్రను తెలియజేస్తుంది. వృత్తిపరమైన సముద్ర శిక్షణకు ప్రాధాన్య ఎంపికగా భారతీయ నౌకాదళ స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయి: టీఆర్ఎస్

## -తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను విస్మరించి రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాయి - టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి

సంగారెడ్డి, జూలై 16 (నేటి నిజం ప్రతినిధి): ఆంధ్ర పాలకుల ఆధిపత్యాన్ని ఎదిరించి, ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ, ఆ ఉద్యమం లక్ష్యాలు, ఆకాంక్షలను విస్మరించి స్వార్థ రాజకీయాలకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరిమితమయ్యాయని టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి విమర్శించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి పరస్పర విమర్శలు, ప్రతి విమర్శలతో కాలక్షేపం చేస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆయన ఆరోపించారు.



సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ లక్ష్యాలైన "నీళు-నిధులు-నియామకాలు" సాధించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో వైఫల్యం చెందిందని, రైతులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్య ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని విమర్శించారు.

ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ఆరోపణలు, ప్రతి ఆరోపణలకే పరిమితమయ్యారని ఆయన అన్నారు. జగ్గారెడ్డి, హరీష్‌రావు నిర్వహిస్తున్న మీడియా సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారాల కంటే రాజకీయ విమర్శల వేదికలుగా మారాయని వ్యాఖ్యానించారు.

సంగారెడ్డి అభివృద్ధికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులే ప్రధాన అడ్డంకిగా మారారని దయాకర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు చేరాల్సిన చోట కొందరి అనుచరులు, బంధువులకే పరిమితమవుతున్నాయని, పరిశ్రమల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుని అన్యాయం చేశారని అన్నారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యకు కూడా ఈ రెండు పార్టీలే బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

తాజా, మాజీ ఎమ్మెల్యేలు "మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు" చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి అసలు స్వరూపాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే నాయకత్వం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్ఎస్ నిలుస్తుందని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలకు రూ.20 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పించి ఉద్యోగాల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, అందరికీ నాణ్యమైన వైద్యం, విద్యా భరోసా, సామాజిక న్యాయం, అవినీతి రహిత పాలన అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 23 నియోజకవర్గాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇన్‌చార్జిలను నియమించడం సామాజిక న్యాయంపై పార్టీ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

"తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం జరిగింది. ఆ ఉద్యమ ఆశయాలను నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తి టీఆర్ఎస్‌కే ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారు. తెలంగాణకు నిజమైన అభివృద్ధి టీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుంది" అని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు.

రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలంగా పోటీ చేస్తుందని, రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో పార్టీ విజయ పతాకాన్ని ఎగురవేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కాళ్వకుంట్ల కవిత నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ మీడియా సమావేశంలో పార్టీ నాయకులు శంకర్ నాయక్, నర్సింహరెడ్డి, రాహుల్, గోపాల్, రెడ్డిమర్రి రఘు, మజ్జి రవీందర్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో వేగవంతంగా సర్ ప్రక్రియ

ఆదిలాబాద్, జులై 17:మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఎస్ఐఆర్ ఓటర్ హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

వార్డు పరిధిలోని ఓటర్లకు ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటరు నమోదు, వివరాల మార్పులు వంటి సేవలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందించారు. ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైతే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

# ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ క్షయపై యుద్ధంలో డ్రోన్ల సాయం.. తెలంగాణలో ఐసీఎమ్ఆర్ అధ్యయనం

న్యూఢిల్లీ, జులై 17:క్షయవ్యాధి (టీబీ)కి సంబంధించిన కఫం నమూనాల రవాణాకు డ్రోన్ సాయాన్ని తీసుకొని మారుమూల ప్రాంతాల్లో, వైద్య సేవలకు అంతగా నోచుకోని ప్రాంతాల్లో ప్రజలకు రోగనిర్ధారణ సేవలను మెరుగుపరచవచ్చని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎమ్ఆర్) తన 'ఐ-డ్రోన్' (తి-ఆఖీూఔఇ) కార్యక్రమంతో నిరూపించింది.

తెలంగాణ.. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఏఐఐఎమ్ఎస్ బీబీనగర్, జిల్లా టీబీ కార్యాలయం సహకారంతో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్టీఈపీ)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయవ్యాధి నిర్ధారణకు రోగుల రవాణాకు ఇంతవరకు సాంప్రదాయిక పద్ధతిని అనుసరించారు. ఇప్పుడు డ్రోన్ల సాయాన్ని తీసుకున్నారు. కళ్లె నమూనాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్సీల) నుంచీ, ఉపకేంద్రాల (ఎస్సీల) నుంచీ సేకరించి, నిర్దేశిత టీబీ రోగనిర్ధారణ ప్రయోగశాలల (టీయూల) వద్దకు డ్రోన్లతో చేర్చారు.

840 మందికి సంబంధించిన అధ్యయనంలో.. నమూనాల రవాణాకు డ్రోన్లను ఉపయోగించి, టీబీ నిర్ధారణకు పట్టే సగటు సమయం 15 రోజుల నుంచి 5 దినాలకు తగ్గించగలిగారు. దీంతో రోగనిర్ధారణలో అయ్యే ఆలస్యం కూడా చాలా వరకు తగ్గిపోయింది. వ్యాధి సోకిన విషయాన్ని త్వరగా నిర్ధారించి, చికిత్సకు సంబంధించిన నిర్ణయాలను వెంట వెంటనే తీసుకోవడం సాధ్యమైంది.

రోగులకు అవుతున్న ఖర్చు చాలావరకు తగ్గిపోయింది. సాంప్రదాయిక రవాణా పద్ధతిలో టీబీ రోగనిర్ధారణకు ప్రయాణం, తదితరాలపై రోగి సగటున రూ. 9,451 వరకు ఖర్చు పెట్టాల్సివస్తుండగా డ్రోన్-ఆధారిత రవాణా పద్ధతిలో ఈ ఖర్చు రూ.91కి తగ్గింది. ప్రయాణ ఖర్చు, వేతన రూపేణా ఆదాయ నష్టం తగ్గడంతో పాటు ఉమ్మి నమూనాల ను రోగుల ఇళ్లకు దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాల్లో సేకరించే వెసులుబాటు కూడా కల్పించడంతో ఈ ప్రయోజనాలు కలిగాయి. నమూనాల రవాణాకు అవుతున్న సగటు ఖర్చు (అవుట్-ఆఫ్-పాకెట్ ఎక్స్పెండిచర్..ఓఓపీఈ) సున్నాకు తగ్గింది. ఎక్కువ మంది బాధితులు రోగనిర్ధారణకు ప్రయాణ సంబంధిత ఖర్చులేవీ పెట్టుకోవాల్సిన అవసరం రాలేదు. ఈ కార్యక్రమాన్ని 11 పీహెచ్సీలు, 60 ఉపకేంద్రాలు, 4 టీబీ యూనిట్ల పరిధిలో అమలు చేశారు. రోగులు కఫం నమూనాలను చాలా దూరం వెళ్లి రోగనిర్ధారణ కేంద్రాలకు అందించడానికి బదులు, తమ ఊళ్లకు దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే అందించారు.

ఆరోగ్య పరిశోధన విభాగ కార్యదర్శి, ఐసీఎమ్ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ మాట్లాడుతూ, "క్షయవ్యాధి నిర్మూలన దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో తక్కువ ఖర్చులో, సకాలంలో రోగనిర్ధారణ సదుపాయం ఎంతో కీలకపాత్రను పోషిస్తుంది. సాంకేతికత .. సమస్యలను దూరం చేసింది. రోగులకు, మరీముఖ్యంగా దూర ప్రాంతాల్లో నివసించే రోగులకు ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఈ పద్ధతి ఎలా తోడ్పడుతుందో అధ్యయనం నిరూపించింది. ఐ-డ్రోన్ కార్యక్రమం ఫలితాలు రాబోయే కాలంలో ప్రజారోగ్య రంగంలో నూతన ఆవిష్కరణలకు తోడ్పడతాయి. ఈ ఫలితాలు ప్రస్తుతం ఆరోగ్యసంరక్షణ సేవలందించడానికి అనుసరిస్తున్న పద్ధతులకు పూరకంగా కూడాఉంటాయి"అన్నారు.

డ్రోన్లను ఉపయోగించినందువల్ల ఆలస్యాన్ని తగ్గించినట్లు, నిర్వహణ సామర్థ్యం మెరుగుపడినట్లు, ప్రజలు ఈ పద్ధతికి అనుకూలంగా స్పందించినట్లు అధ్యయనంలో పాలుపంచుకున్న ఆరోగ్యసంరక్షణ కార్యకర్తలు వివరించారు. వాతావరణం, పేలోడ్ పరిమితులు, నిరంతర శిక్షణను తీసుకోవాల్సిన అవసరం వంటి నిర్వహణ సంబంధిత అంశాలపైన కూడా అధ్యయనంలో దృష్టి సారించారు. ఈ పద్ధతిని మరింత విస్తృత స్థాయిలో అమలు చేయాలంటే ఇంకా అనేక జాగ్రత్తచర్యలు తీసుకొని ముందుకు పోవాల్సి ఉంటుందని తేలింది.

జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరును పరిశోధకులు గమనించారు. మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి డ్రోన్- ఆధారిత ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్) కీలకమని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని వారు అన్నారు. విభిన్న ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తే విషయాలు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవడానికి మరింత అవగాహన ఏర్పడుతుందని వారు అన్నారు.

ఐసీఎమ్ఆర్ ఐ-డ్రోన్ కార్యక్రమ సత్ఫలితాలు దేశంలో సుదూర ప్రాంతాల్లో ఆరోగ్యసంరక్షణ సేవలను ఇప్పటి కన్నా మెరుగ్గా అందించడానికి అవసరమైన టీకామందులు, ఔషధాలు, రక్త ఉత్పాదనలు, రోగనిర్ధారణ సంబంధిత నమూనాలు, కణజాలం వగైరా రవాణా చేయడానికి డ్రోన్లను ఉపయోగించేందుకు అవకాశాలు ఎంతవరకు ఉన్నాయో ఈ ఐ-డ్రోన్ కార్యక్రమం ద్వారా పరిశీలిస్తున్నారు.

# ఆర్థిక సంఘం నిధులను వాడుకుంటే సహించం

## –కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, జులై 17: (నేటినిజం ప్రతినిధి) కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 105 కోట్లతో నిర్మించారు తలపెట్టిన చెరువు పునరుద్ధరణ తో పాటు ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రం అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను కరెంట్ బిల్లులు, జీతాలకు ఎట్లా మళ్లిస్తారన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాయాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, సిబ్బంది జీత భత్యాలకు కూడా నిధులివ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.

**అమృత్ కింద భారీగా నిధులు**

తెలంగాణ కు అమృత్ 1 కింద 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. కరీంనగర్ పార్లమెంట్ లోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమ్రుత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించింది. అందులో ఈ సిరిసిల్ల మున్సిపాలిటీకి 105 కోట్ల 57 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నాం. కేంద్రం పెద్ద ఎత్తున తెలంగాణకు నిధులిస్తోంది. 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. అయినా కేంద్రం ఏమిచ్చింది.తెలంగాణకు అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వచ్చి అబద్దాలాడుతున్నారు . అసలు తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందంటే కేంద్రం ఇస్తున్న నిధులే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదు. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇయ్యలేదు. మోదీ ప్రభుత్వం వివిధ స్కీంల కింద నిధులు ఖర్చు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి గీతే తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి..

## –ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ఫారం నింపి బీఎల్ వోలకు అందజేయాలి..పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




కరీంనగర్, జులై 17: (నేటినిజం ప్రతినిధి) రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కొలనూర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కొలనూర్ గ్రామంలో రైతులతో సమావేశమై పంట మార్పిడిపై అవగాహన కల్పించి పంట పొలాలను సందర్శించారు. అలాగే ఓదెల జడ్పీహెచ్ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, అనంతరం నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిందన్నారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి పూర్తిగా నింపించి తిరిగి సేకరించాలని ఆదేశించారు. ఓటర్లు కూడా ఫారాలను త్వరితగతిన పూర్తి చేసి బీఎల్ వోలకు అందించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలు, వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలు ఓటర్లకు ఫారాలు సక్రమంగా నింపడంలో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో సూపర్ ఎల్నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుండటంతో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గాయని, గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగును పూర్తిగా నివారించి చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచిందని, వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకొని వారి సూచనల మేరకు సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

ఓదెల జడ్పీ హెచ్ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలను పరిశీలించిన సందర్భంగా ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. విద్యా సంవత్సరానికి రూపొందించిన ప్రణాళిక ప్రకారం సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి విద్యార్థికి అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సదుపాయాల గురించి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన వి ద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బోధన అందించాలని ఆదేశించారు. ఓదెల మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఓదెల తహసీల్దార్ వనజ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టును సాకారం చేసిన దార్శనికుడు కేసీఆర్

## –మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం, జులై 17:ఆనాడు కాంగ్రెస్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గురై కునారిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని జలయజ్ఞం అని ధనయజ్ఞంగా మార్చి మొబిలైజేషన్ అడ్వాన్స్ల పేరిట దోపిడీ చేసి ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మార్చిందని విమర్శించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టిందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9 వేల కోట్లు వెచ్చించి, 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్లు, పైప్లైన్లు, ట్రాన్స్మిషన్ వ్యవస్థలను నిర్మించామని, అధిక సామర్థ్యం గల మోటార్లు, ఆధునిక యాంత్రిక పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు.

భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగానికి సాగర్ ఆయకట్టుకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడం, వ్యవసాయాభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును రూపుదిద్దారని పేర్కొన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు సీతారామ ప్రాజెక్టుకు తాము ఎంత మేర నిధులు ఖర్చు చేశారో చేసిన కృషి ఏమీ లేక ప్రజలకు చెప్పుకునే విషయాలు లేకపోవడంతో కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులనే తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం కాంగ్రెస్ మంత్రులు చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఎవరి కృషి ఏమిటో వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలుసని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

# రీజినల్ ఏఐఎం సంవాద్-నార్త్ ఈస్ట్ చాప్టర్ 2026

## భారత్లో అత్యాధునిక ఆవిష్కరణలకు అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఊతం

న్యూఢిల్లీ, జులై 17:దేశ ఆవిష్కరణల రంగంలో అత్యంత వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల్లో ఒకటిగా ఈశాన్య భారత్ ఎదుగుతున్న తరుణంలో అస్సాంలోని గువాహటి వేదికగా నీతి ఆయోగ్కు చెందిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) 'రీజినల్ ఏఐఎం సంవాద్- నార్త్ ఈస్ట్ చాప్టర్ 2026' (ప్రాంతీయ ఏఐఎం సంవాద్-ఈశాన్య ప్రాంత సమావేశం) సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్ర మంలో విధాన రూపకర్తలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, పారిశ్రామిక నేతలు, విద్యావేత్తలు, ఇంక్యుబేటర్లు, అంకుర సంస్థల వ్యవస్థ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురలలో ఆవిష్కరణల ఆధారిత వృద్ధికి ఒక ఉమ్మడి ప్రణాళికను రూపొందించడానికి ఈ సదస్సు తోడ్పడింది.

ఆగ్నేయాసియా దేశాలకు భారత్ ముఖద్వారంగా ఉన్న ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్న ఈ సదస్సు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. గొప్ప జీవవైవిధ్యం, శక్తిమంతమైన సాంస్కృతిక వారసత్వం, వెదురు వనరులు, సంప్రదాయ హస్తకళలతో పాటు వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక వ్యవస్థకు ఈ ప్రాంతం నిలయంగా మారింది. ఈశాన్య ప్రాంత ప్రత్యేక బలాలను గుర్తించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్.. దేశంలో తదుపరి దశ ఆవిష్కరణల ఆధారిత వృద్ధికి ఈ ప్రాంతం కీలక శక్తిగా నిలుస్తుందని, భారత్ 2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ వేదిక ద్వారా నిరూపించింది.

ఈ సదస్సు ప్రారంభ సమావేశానికి నీతి ఆయోగ్ సభ్యురాలు డాక్టర్ జోరమ్ అనియా ముఖ్య అతిథిగా హాజర య్యారు. వీరితోపాటు అస్సాం ప్రభుత్వ కమిషనర్, కార్యదర్శి కూడా పాల్గొన్నారు. డాక్టర్ అనియా ప్రసంగిస్తూ.. ఈశాన్య ప్రాంతాన్ని "అష్టలక్ష్మి"గా అభివర్ణించిన ప్రధానమంత్రి దార్శనికతను గుర్తుచేస్తూ, ఈ ఎనిమిది రాష్ట్రాల్లో ప్రతి ఒక్కదానికి ప్రత్యేకమైన బలాలు, దేశ వృద్ధి పథంలో భాగస్వామ్యం వహించే అపారమైన సామర్థ్యాలు ఉన్నాయని తెలిపారు. ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నీతి ఆయోగ్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, ఇక్కడి మౌలిక సదుపాయాలు, రవాణా సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి కోసం భారీ పెట్టుబడులు పెడుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రస్తావించారు. "యాక్ట్ ఈస్ట్ టు యాక్ట్ ఫాస్ట్" విధానం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరిస్తూ.. నేడు ఈశాన్య ప్రాంతం దేశ అభివృద్ధి అజెండాలో కేంద్ర బిందువుగా నిలిచిందని చెప్పారు. భవిష్యత్తులో ఇది ఆవిష్కరణలు, వ్యవసాపకత, స్థిరమైన వృద్ధికి ప్రపంచ కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులకు అటల్ ఇన్నోవేషన్ మిషన్ అధిపతి (ఆర్థిక విభాగం) సుమిత్ గఖర్ స్వాగతం పలికారు. ఈశాన్యం ప్రాంతంలోని ఆవిష్కరణల సామర్థ్యాన్ని వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, ఆవిష్కరణల సంస్థలు, ఇంక్యుబే టర్లు, భాగస్వాముల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడా నికి అటల్ ఇన్నోవేషన్ మిషన్ కట్టుబడి ఉందని ఆయన చెప్పా రు.

అటల్ ఇన్నోవేషన్ మిషన్ మిషన్ డైరెక్టర్ దీపక్ బాగ్లా మాట్లాడుతూ.. "ఈశాన్య ప్రాంతాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'అష్టలక్ష్మి'గా అభివర్ణించారు. అపారమైన ప్రతిభ, సాంస్కృతిక వైవిధ్యం, సహజ వనరులు, పారిశ్రామిక స్ఫూర్తి కలగలిసిన ఈ ప్రాంతం.. వికసిత్ భారత్ 2047 దిశగా సాగుతున్న దేశ ప్రయాణంలో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా మేము ఆవిష్కర్తలను ప్రోత్సహించడం, ఇంక్యుబేషన్ వ్యవస్థలను బలోపేతం చేయడం, యువ పారిశ్రామికవేత్తలు ఈశాన్య ప్రాంతం నుంచి దేశం కోసం, ప్రపంచం కోసం సరికొత్త పరిష్కారాలను కనుగొనేలా వారికి తోడ్పాటును అందించడం ద్వారా ఈ దార్శనికతను ఒక గొప్ప అవకాశంగా మార్చడానికి కృషి చేస్తున్నాం. దీనికోసం స్థానిక బలాలు ఆధారంగా సాగే ఆవిష్కరణలకు అందరి కృషి తోడైనప్పుడు ఈశాన్య ప్రాంతం దేశ వృద్ధి ప్రస్థానంలో భాగస్వామ్యం వహించడమే కాకుండా, దానికి ముందుండి నాయకత్వం వహిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ సదస్సులో భాగంగా "ప్రాంతీయ ఆవిష్కరణల రంగ భాగస్వాములను ఏకతాటిపైకి తీసుకురావడం' అంశంపై ఒక రౌండ్ టేబుల్ చర్చా కార్యక్రమం జరిగింది. దీనిలో ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల మండళ్ల ప్రతినిధులతో పాటు శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్టీ), బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాలు (ఏఐసీలు), అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ కేంద్రాల (ఏసీఐసీ) ప్రతినిధులు పాల్గొన్నారు. పరస్పర సహకారంతో కూడిన ఆవిష్కరణల దిశగా సాగుతున్న వేగాన్ని ఈ చర్చలు ప్రతిబింబించాయి. జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రాంతీయ ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రాధాన్యతను ఈ సమావేశం తెలియజేసింది.

రోజంతా జరిగిన ఈ కార్యక్రమంలో ఈశాన్య ప్రాంతానికి ప్రత్యేకమైన పోటీతత్వ ప్రయోజనాలు ఉన్న రంగాలపై విడివిడిగా ప్రత్యేక సమావేశాలు, విశ్లేషణాత్మక చర్చలు నిర్వహించారు. వెదురు, జీవ వనరుల విలువ వ్యవస్థను వాణిజ్యపరంగా ఎలా లాభదాయకంగా మార్చవచ్చనే అంశాలపై నార్త్ ఈస్ట్ కేన్ అండ్ బాంబూ డెవలప్మెంట్ కౌన్సిల్ (ఎన్ఈసీబీడీసీ) సీనియర్ శాస్త్రవేత్త, కన్సల్టెంట్ తిలక్ చంద్ర భుయాన్ తమ అనుభవాన్ని పంచుకున్నారు. సాంకేతికతతో కూడిన సుస్థిర పర్యావరణహిత పర్యాటకం రంగంలోని అవకాశాలను ట్రైవ్ మేఘాలయ, ఎంబీఎంఏ ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్న మిన్హా రియాజ్ ఖాన్ వివరించారు. సంప్రదాయ చేనేత, హస్తకళల విభాగాల్లో ఆవిష్కరణల ద్వారా గ్రామీణ స్థాయి జీవనోపాధిని బలోపేతం చేయడంపై రాయల్ గ్లోబల్ యూనివర్సిటీ వ్యవస్థాపకత, ఆవిష్కరణల విభాగం డైరెక్టర్, మార్గదర్శక్ అడ్వైజరీ సహ వ్యవస్థాపకురాలు, ఎన్ఈహెచ హెచ్డీసీ మాజీ సలహాదారు డాక్టర్ శ్రీపర్ణ భుయాన్ బారువా చర్చించారు.

ఈశాన్య ప్రాంతంలోని ఇంక్యుబేషన్ వ్యవస్థను బలోపేతం చేయడంపై సదస్సులో మరో కీలక చర్చ జరిగింది. ఏఐసీ-సెల్కో ఫౌండేషన్ సోసియేట్ డైరెక్టర్ రచిత మిశ్రా ఈ చర్చా కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఐఐటీ గువాహటి గ్రూపు సీఈఓ కల్నల్ ప్రబీర్ సేన్గుప్తా, మిరియడ్ ఏఐ-గోబిలియన్ వ్యవస్థాపకుడు, సీఈఓ రోషన్ ఫర్హాన్, ఎస్ఎన్ఎల్ ఎనర్జీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మోయిరాంగ్థెమ్ సేథ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్న ప్రతీక్ దేశ్ముఖ్ ఈ చర్చలో పాల్గొన్నారు.

ఆలోచనల దశ నుంచి అంకుర సంస్థలకు మద్దతివ్వగల పటిష్టమైనన ఇంక్యుబేషన్ వ్యవస్థల నిర్మాణ వ్యూహాలపై వీరంతా సమగ్రంగా చర్చించారు.

సదస్సులో భాగంగా జరిగిన మరో నిపుణుల చర్చకు ఏఐసీ ఎస్ఎంయూ టీబీఐ సీఈఓ డాక్టర్ తేజ్ చింగ్థామ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈశాన్య ప్రాంతంలోని అంకుర సంస్థలక ఆర్థిక వనరులను సమకూర్చడం, కార్పొరేట్ భాగస్వామ్యాలను పెంపొందించడం, మార్కెట్ అనుసంధానాలను కల్పించే మార్గాలపై చర్చించారు. హెచ్డీఎఫ్సీ బ్యాంకు న్యూ ఎకానమీ గ్రూప్ ఉపాధ్యక్షుడు-ఎఐ, అధిపతి ఆశిష్ అగర్వాల్, నుమాలిగఢ్ రిఫైనరీ లిమిటెడ్ కార్పొరేట్ ప్లానింగ్, స్ట్రాటజీ అధిపతి ప్రంత ప్రతీమ్ సిన్హా, ఎన్ఈడీఎఫ్ఐ మేనేజర్ సిద్ధార్థ పీ లహ్కార్, టాటా ఫౌండేషన్ సెంటర్ ఫర్ మైక్రోఫైనాన్స్, లైవ్లీహుడ్ జనరల్ మేనేజర్ కౌటిల్య బసుమతరి ఈ చర్చలో పాల్గొన్నారు. ఈశాన్య ప్రాంతంలో యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సంస్థాగత మద్దతు వ్యవస్థను బలోపేతం చేయడంపై వీరంతా కలిసి చర్చించారు.

వ్యాపార సంస్థలు, స్థానిక అభివృద్ధి కోసం స్థితిస్థాపకత కలిగిన ఆవిష్కరణల వ్యవస్థలను నిర్మించడంపై జరిగిన సమావేశంతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశానికి రచిత మిశ్రా సమన్వయకర్తగా వ్యవహరించగా.. ఈఆర్ఈఎస్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఫజ్లే ఇలాహి, ఎడ్యుసెంటర్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ సేయిలెజో పుత్సురే పాల్గొన్నారు. చివరగా నీతి ఆయోగ్ పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ కార్యక్రమ డైరెక్టర్ ప్రతీక్ దేశ్ముఖ్ ధన్యవాద సమర్పణ చేశారు.

ఉత్తర, దక్షిణ, మధ్య, తూర్పు ప్రాంతాలలో విజయవంతమైన కార్యక్రమాల అనంతరం 'రీజినల్ ఏఐఎం సంవాద్-నార్త్ ఈస్ట్ చాప్టర్ 2026' సంవాద్ శ్రేణిలో అత్యంత వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన సమావేశాల్లో ఒకటిగా నిలిచింది. విధాన రూపకర్తలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇంక్యుబేటర్లు, పారిశ్రామిక నాయకులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా దేశంలోని ప్రతి మూలకూ విస్తరించేలా ఒక సమగ్రమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించాలనే అటల్ ఇన్నోవేషన్ మిషన్ నిబద్ధతను ఈ సదస్సు మరోసారి స్పష్టం చేసింది. ఈశాన్య ప్రాంతానికి గల విశిష్ట బలాల ఆధారంగా సహకారం, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతతో నడిచే ఈ కార్యక్రమం.. వికసిత్ భారత్ 2047 దిశగా దేశ ప్రయాణాన్ని తీర్చిదిద్దడంలో ఈశాన్య ప్రాంతం పోషిస్తున్న కీలక పాత్రను వివరించింది.

# కుమ్మరి కుంట కొలామ్ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

కుమ్మరికుంట కొలామ్ గిరిజన సందర్శించిన రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ , సభ్యులు పిఓ



మహబూబ్‌నగర్, జులై 17:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కుమ్మరికుంట గిరిజన గ్రామాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్, భక్తి వెంకటయ్య, కమిషన్ సభ్యులు, ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో పర్యటించిన అధికారులు స్థానిక గిరిజన కుటుంబాలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి జీవన పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, నివాస సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు తమకు శాశ్వత గృహాల అవసరం, భూమి, నివాస హక్కులు, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్థుల సమస్యలను ఎంతో శ్రద్ధగా విన్న రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మందమకరందుమాట్లాడుతూ, కుమ్మరికుంట గ్రామంలోని ప్రతి అర్హ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణానికి అవసరమైన అన్ని అర్హతలు, హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో గౌరవ ముఖ్యమంత్రితో నిర్వహించే సమావేశంలో ఈ గ్రామానికి సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించి, శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హ కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా ఐటీడీఏ తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, గృహ నిర్మాణం, తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్శన సందర్భంగా కుసురం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్,రాంబాబు నాయక్ కమిషన్ సభ్యులు, ఐటీడీఏ అధికారులు, అటవీ శాఖ, ఆరోగ్య శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గిరిజన కుటుంబాలు పాల్గొన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇవ్వడంపై రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు, ప్రాజెక్టు అధికారి మంద మకరందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉట్కూర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం..

**–ఉట్కూర్ సర్పంచ్ ఎం. రేణుక భరత్**

మహబూబ్‌నగర్, జులై 17: నారాయణపేట జిల్లా ఉట్కూర్ పట్టణంలోని అన్ని 16 వార్డుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఉట్కూర్ సర్పంచ్ ఎం. రేణుక భరత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భరత్ నగర్,మూడో వార్డులో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అన్ని వార్డుల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు కొక్కు మల్లేష్, నాయకులు కార్యకర్తలు కృష్ణయ్య గౌడ్, హన్మంతు, కొక్కు లక్ష్మణ్ రమేష్, రణవీర్, తిమ్మప్ప, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 'వికసిత్ భారత్ కోసం వ్యసన రహిత యువత' ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ యువ కనెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మై భారత్

న్యూఢిల్లీ, జులై 17:వికసిత్ భారత్ 2047, మత్తు రహిత భారత్‌ను నిర్మించాలనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ. మై భారత్ ద్వారా దేశవ్యాప్త విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో 'వికసిత్ భారత్ యువ కనెక్ట్ కార్యక్రమం' నిర్వహించనుంది. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ (వికసిత్ భారత్ కోసం వ్యసన రహిత యువత) అనే ప్రత్యేక ఇతివృత్తంతో ఈ కార్యక్రమం జులై 16 నుంచి ఆగస్టు 15, 2026 వరకు ఈ కార్యక్రమం సాగనుంది.

నెల రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం.. యువతీ యువకులను దేశ అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించడమే కాకుండా, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పిస్తుంది. పౌర భాగస్వామ్యాన్ని, మాదక ద్రవ్య వ్యతిరేక ప్రచారాన్ని మేళవించడం ద్వారా యువతను ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన, వ్యసన రహిత భారతదేశానికి బ్రాండ్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం కృషి చేస్తుంది.

ఈ కార్యక్రమం మై భారత్ వేదికపై ముఖాముఖి చర్చలు, అవగాహన కార్యక్రమాలు, డిజిటల్ భాగస్వామ్యం వంటి అంశాలపై విద్యార్థులలో చైతన్యం తీసుకురానుంది. వికసిత్ భారత్ 2047 దార్శనికతను సాకారం చేసుకోవడానికి మాదక ద్రవ్య రహిత సమాజమే అత్యంత ఆవశ్యకమని గ్రహించేలా చేయడం, దేశ నిర్మాణంలో యువత చురుగ్గా పాలుపంచుకునేలా ఉత్తేజపరచడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

ఈ కార్యక్రమంలో భాగంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) రాష్ట్ర ఛాంపియన్లు, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ విజేతలు, ఎన్‌ఎస్‌ఎస్ అవార్డు గ్రహీతలు, జాతీయ యువజన పురస్కార గ్రహీతలు, ఇతర ప్రతిభావంతులైన యువ నాయకులు ప్రత్యేక యూత్ ఐకాన్స్ రూపంలో వివిధ విద్యాసంస్థలను సందర్శిస్తారు. విద్యార్థులతో నేరుగా సంభాషిస్తూ దేశ అభివృద్ధి ప్రస్థానంపై వారు తమ అనుభవాలను పంచుకుంటారు. మాదకద్రవ్యాల అలవాటు అనేది ఒక వ్యక్తి ఆశయాలకు, సామాజిక శ్రేయస్సుకు, దేశ పురోగతికి ఎలా ఒక పెద్ద సవాలుగా మారుతుందో యువతకు వివరిస్తారు.

ఈ సదస్సులలో పాల్గొనే విద్యార్థుల కోసం మాదకద్రవ్యాల బారిన పడి కోలుకున్న వ్యక్తులు, వారి కుటుంబాలు అనుభవించిన బాధాకరమైన నిజ జీవిత అనుభవాలను తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన ఒక అవగాహన చిత్రాన్ని ప్రదర్శిస్తారు. అనంతరం విద్యార్థులందరితో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తారు. తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతామని, దేశాభివృద్ధికి తోడ్పడతామని యువత మరోసారి ప్రమాణం చేస్తుంది. వీలైన చోట్ల స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో... వ్యసనం నుంచి విజయవంతంగా బయటపడిన రికవరీ వారియర్స్ తమ నిజ జీవిత అనుభవాలను నేరుగా పంచుకునేలా ఏర్పాట్లు చేసి ఈ ప్రచార ప్రభావాన్ని మరింత పెంచుతారు.

విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి కార్యక్రమ వేదికల వద్ద ప్రత్యేక మై భారత్ ఫెసిలిటేషన్ డెస్కులను ఏర్పాటు చేస్తారు. ఇవి విద్యార్థులు అక్కడికక్కడే మై భారత్ వేదికలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి, ఈ సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న వివిధ యువజన అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకోవడానికి సహాయపడతాయి. దేశవ్యాప్తంగా బ్యానర్లు, స్టాండీలు, డిజిటల్ ప్రచారం ద్వారా ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తారు.

ఈ కార్యక్రమం ప్రధానంగా గ్రామీణ, పట్టణ, గిరిజన వర్గాలకు చెందిన 15 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువతను భాగస్వాములను చేస్తుంది. పాల్గొనే సంస్థలు భవిష్యత్తులో నిరంతర యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి, రాబోయే మై భారత్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి వీలుగా మై భారత్ చాప్టర్లను ఏర్పాటు చేయవచ్చు. అన్ని రకాల రిజిస్ట్రేషన్లు, కార్యక్రమానికి సంబంధించిన కార్యకలాపాలు మై భారత్ వేదిక ద్వారా నిర్వహిస్తారు.

'వికసిత్ భారత్ యువ కనెక్ట్ ప్రోగ్రామ్' అనేది సమాజం పట్ల అవగాహన, బాధ్యత, సామాజిక స్పృహ కలిగిన యువ పౌరులను తీర్చిదిద్దడంలో మై భారత్ నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తుంది. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం పోరాడుతూనే.. 2047 నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చే ప్రయాణంలో ఈ యువతే ముందుండి నడిపిస్తుంది.

# ఎనిమిదో విడత గనుల వేలాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి, సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే

న్యూఢిల్లీ, జులై 17:ఇండియా మైనింగ్ వీక్-2026 సన్నాహక కార్యక్రమంలో భాగంగా కీలకమైన, వ్యూహాత్మకమైన ఖనిజ బ్లాక్‌ల ఈ-వేలం ఎనిమిదో విడతను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి, బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే ప్రారంభించారు. భారత దేశంలో శుద్ధ ఇంధనం, అధునాతన తయారీ, రక్షణ, ఏరోస్పేస్, ఇతర వ్యూహాత్మక రంగాలకు అవసరమైన కీలకమైన ఖనిజాల భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పటిష్టమైన ఖనిజ సరఫరా వ్యవస్థలను నిర్మించడంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం ఒకటి. భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాష్ట్రాల ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), మేధావులు, ప్రోస్పెక్టివ్ బిడ్డర్లు, విలేకరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి ప్రసంగించారు. దేశ మైనింగ్ రంగంలో వృద్ధిని వేగవంతం చేయడానికి విధాన రూపకర్తలనూ, పరిశ్రమ నాయకులనూ, పెట్టుబడి దారులనూ, సాంకేతిక సేవలు అందించే వారినీ, విద్యావేత్తలనూ ఒక్కచోట చేర్చే ప్రధాన వేదిక ప్రారంభాన్ని ఇండియా మైనింగ్ వీక్ సూచిస్తుందన్నారు. ఖనిజ భద్రతను బలోపేతం చేయడంలోనూ, పెట్టుబడులను ఆకర్షించడంలోనూ, అంతర్జాతీయంగా పోటీనిచ్చేలా, భవిష్యత్తు అవసరాలకు తగిన మైనింగ్ వ్యవస్థను నిర్మించేలా దేశ ఖనిజ సామర్థ్యాన్ని వెలికి తీయడంలోనూ ప్రభుత్వానికి ఉన్న అంకితభావాన్ని ఈ కీలకమైన, వ్యూహాత్మకమైన ఖనిజ బ్లాకుల ఎనిమిదో విడత ప్రారంభం ప్రతిబింబిస్తుందని ఆయన చెప్పారు.

దేశ నిర్మాణంలోనూ, ఇంధన భద్రత, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలోనూ మైనింగ్ కీలకంగా నిలుస్తుందని కేంద్ర బొగ్గు, గనుల సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే అన్నారు.

# ఫ్లైఓవర్ పనులు వెంటనే పూర్తి చేయాలి -బి ఆర్ ఎస్

## –కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

నల్గొండ, జులై 17: చిట్యాల పట్టణంలోని హైవేపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం చిట్యాల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 జూలైలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రకటించినప్పటికీ, రెండున్నరేళ్లు గడిచినా పనులు పూర్తికాలేదని ఆరోపించారు . పనులు ఆలస్యం కావడంతో చిట్యాల పట్టణంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి పట్టణ ప్రజల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో చిట్యాల సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి మరియు బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి , బొబ్బల శివశంకర్ రెడ్డి, జిట్టా బొందయ్య , స్థానిక 10వ వార్డు కౌన్సిలర్ నిమ్మనగొట్టి శ్రీను వాసు,2వ వార్డ్ కౌన్సిలర్ ఎస్కే షబానా అజీముద్దీన్ ,కందాటి రమేష్ రెడ్డి ,ఆగు అశోక్ యాదవ్ కన్నెబోయిన శ్రీశైలం ,రుద్రవరం యాదయ్య, మారగోని రమేష్ ,నాళావతి కృష్ణ, ఆవుల ఆనంద్ ,జిట్ట శేఖర్,సాయి రెడ్డి ప్రతాపరెడ్డి ,పోకల రాములు, కునూర్ శంకర్ ,పాల కిష్టయ్య, రామగిరి జనార్దన్ రావు ,రుద్రారపు కృష్ణ, బాలు ,మాసపెల్లి వెంకన్న ,తోటకూరి అనిల్ రాగుల శివ ,ఓట ముజ్జు ,పో లాస్ కన్యాచారి ,చింతపల్లి ప్రవీణ్, ఐలాపూర్ నరేష్ ,బొడ్డుపల్లి శ్రీను, బొడ్డుపల్లి ఉపేందర్ ,సిలువేరు రిశ్వంత్ ,గూడ అఖిల్ ,బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# భారత్ టెక్స్ 2026లో మహిళల నేతృత్వంలోని గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులను ప్రదర్శించిన గ్రామీణాభివృద్ధి శాఖ

న్యూఢిల్లీ, జులై 17:దీన్ దయాల్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా ప్రతిష్ఠాత్మక భారత్ టెక్స్ 2026 ప్రదర్శనలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పాల్గొంది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జులై 14 నుంచి 17, 2026 వరకు జరుగుతున్న ఈ అంతర్జాతీయ వేదికపై దేశవ్యాప్త స్వయం సహాయక సంఘాల గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను, వారి నేతృత్వంలోని సూక్ష్మ పరిశ్రమలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు.

ఈ ప్రదర్శన ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన లఖ్‌పతీ దీదీలు అంతర్జాతీయ వస్త్ర రంగ వేదికపైకి అడుగు పెట్టారు. తమ నైపుణ్యంతో రూపొందించిన ఉత్పత్తులను దేశ విదేశీ సందర్శకులు, కొనుగోలుదారులు, పరిశ్రమల ప్రతినిధుల ముం-దు ప్రదర్శిస్తున్నారు. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి సాధించడంలో, కుటుంబ ఆదాయాలను మెరుగు పరుచుకోవడంలో, స్థానిక కళలు, ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేయడంలో వారు పోషిస్తున్న అద్భుతమైన పాత్రను ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.

ఈ విశిష్ట ప్రదర్శనను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ జీవనోపాధి సంయుక్త కార్యదర్శి శ్రీమతి స్వాతి శర్మ, డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డాక్టర్ మోలిశ్రీ పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం వీరంతా ప్రదర్శనలో పాల్గొన్న లఖ్‌పతీ దీదీలతో ముఖాముఖి మాట్లాడారు. దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ మహిళా నేతృత్వంలోని సంస్థలు ప్రదర్శించిన విభిన్న రకాల ఉత్పత్తులను వారు ఆసక్తిగా తిలకించారు.

ఈ ప్రదర్శన దేశవ్యాప్త గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు కాపాడుకుంటూ ప్రోత్సహిస్తున్న విభిన్న నైపుణ్యాలను, సాంప్రదాయాలను చాటిచెబుతోంది. చేనేత వస్త్రాలు, దుస్తుల తయారీ మొదలుకుని హస్తకళలు, సహజసిద్ధమైన వస్తువులతో తయారు చేసిన ఉత్పత్తుల వరకు ఎన్నో ఈ వేదికపై కొలువుదీరాయి. తరాల నాటి జ్ఞానం, స్థానిక నైపుణ్యాలు విస్తృత మార్కెట్ సౌకర్యం గల స్థిరమైన మహిళా నేతృత్వపు పరిశ్రమలుగా ఎలా రూపాంతరం చెందుతున్నాయో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది.

ఇందులో చేనేత, ధోక్రా లోహపు కళాకృతులు, కొల్హాపూరి తోలు వస్తువులు, జనపనార కళలు, వెదురు ఉత్పత్తులు, చెక్క వస్తువులు, పూసల పనితనం, పట్టు దారాల ఆభరణాలు, పర్యావరణహిత గుర్రపుడెక్క (వాటర్ హైసింత్) మొక్కలతో చేసిన వస్తువుల వంటి ఎన్నో వైవిధ్యభరితమైన సాంప్రదాయ హస్తకళలు, ప్రాంతీయ ప్రత్యేకతలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక సంఘాల పరిశ్రమలు దేశవ్యాప్తంగా ముందుకు తీసుకువెళున్న నైపుణ్యాలను, విభిన్న ముడిసరుకుల వైవిధ్యాన్ని ఇవి స్పష్టం చేస్తున్నాయి.

ఈ ప్రదర్శనలో డే-ఎన్ఆర్ఎల్ఎం కింద సరికొత్తగా ప్రవేశపెట్టిన ప్రీమియం బహుమతుల విభాగం సరస్ శక్తి కలెక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలు రూపొందించిన అత్యుత్తమ నాణ్యత గల హస్తకళా ఉత్పత్తులను బ్రాండెడ్ సంస్థాగత బహుమతుల సేకరలుగా మార్చేందుకు ఈ వినూత్న ప్రయత్నం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ, సంస్థాగత సంస్థల మార్కెట్లలోకి సులభంగా ప్రవేశం లభిస్తుంది. అదే సమయంలో గ్రామీణ కళాకారుల ప్రతిభకు లభించే విలువ, గుర్తింపు దేశవ్యాప్తంగా మరింత మెరుగవుతాయి.

సరస్ శక్తి ఎంపిక కేవలం ఉత్పత్తుల సేకరణ మాత్రమే కాదు.. నాణ్యత, అద్భుతమైన పనితనం, సరికొత్త డిజైన్లు, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, మార్కెట్ సంసిద్ధత వంటి వాటికి ఇచ్చే అత్యున్నత ప్రాధాన్యతతో ప్రత్యేక గుర్తింపు పొందింది. తమ ప్రాంతీయ గుర్తింపును, తరాల నాటి సాంప్రదాయ జ్ఞానాన్ని ఏమాత్రం కోల్పోకుండా.. నేటి ఆధునిక మార్కెట్ అంచనాలకు సరిపోయేలా ఈ ఉత్పత్తులను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తారు. ఒక ప్రత్యేకమైన బ్రాండ్ గుర్తింపు, ఆకర్షణీయమైన ప్రదర్శన ద్వారా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెట్ విలువను పెంచి, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన ఆర్థిక అవకాశాలను సృష్టించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

భారత్ టెక్స్ 2026 ప్రదర్శనలో లఖ్‌పతీ దీదీల భాగస్వామ్యం, స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం రోజువారీ జీవనోపాధి స్థాయి నుంచి ఎలా స్థిరమైన వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించే దిశగా ఎదుగుతున్నారో స్పష్టం చేస్తోంది. డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం ద్వారా గ్రామీణ మహిళలకు అవసరమైన ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, నూతన ఉత్పత్తి రూపకల్పన, మార్కెట్ అనుసంధానాల కల్పన వంటి రంగాలలో లభిస్తున్న పూర్తి మద్దతు వారి ఆదాయాల పెంపుదలకు, వ్యాపారాల విస్తరణకు ఎంతగానో దోహదపడుతోంది.

దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 10 కోట్లకు పైగా గ్రామీణ మహిళలను డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం విజయవంతంగా స్వయం సహాయక సంఘాల్లోకి సమీకరించింది. ఇంతటి భారీ సామాజిక సంస్థాగత వ్యవస్థ ఆధారంగా అమలవుతున్న లఖ్‌పతీ దీద' కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతులను పూర్తిగా మారుస్తోంది. ఇప్పటికే దేశంలో 3 కోట్ల మంది లఖ్‌పతీ దీదీల మైలురాయిని అధిగమించగా.. ప్రభుత్వం దీనిని ఏకంగా 6 కోట్ల మంది లఖ్‌పతీ దీదీలుగా మార్చాలనే అత్యున్నత దార్శనికతతో ముందుకు సాగుతోంది.

భారత్ టెక్స్ 2026లో గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యం.. గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడానికి, కొనుగోలుదారులు, పరిశ్రమల పెద్దలతో నేరుగా చర్చలు జరపడానికి, నూతన మార్కెట్ అవకాశాలను అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందించింది. మహిళల నేతృత్వంలోని గ్రామీణ పరిశ్రమలను బలోపేతం చేయడానికి, సాంప్రదాయ కళలను కాపాడటానికి, గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడానికి భారత ప్రభుత్వం ఎంతటి నిబద్ధతతో ఉందో ఈ కార్యక్రమం మరోసారి రుజువు చేసింది.

# భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి..

**–ఆర్డీవో శ్రీదేవి.**

నల్గొండ, జులై 17:భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా సమగ్ర భూముల రీ సర్వే చేపడుతున్నందున రైతులు, ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి కోరారు. వ్యవసాయ భూముల రీ సర్వే నిర్వహించి రైతులకు భూధార్ కార్డులు అందజేసే కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగారం గ్రామాన్ని తొలి గ్రామంగా ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా శుక్రవారం సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ, ఇనాం, రహదారులు, పట్టా భూములతో పాటు గ్రామ పరిధిలోని అన్ని భూములను సమగ్రంగా సర్వే చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియతో భూముల సరిహద్దులు స్పష్టంగా నమోదై, భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




తహసీల్దార్ నేలపట్ల నరేష్ మాట్లాడుతూ మొదట సర్వే నంబర్ పరిధిలోని మొత్తం భూమిని కొలిచి, అనంతరం భాగాల వారీగా విభజించి ప్రతి రైతుకు ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ధోటి నారాయణ,సర్పంచ్ కుంభం అండాలు రవీందర్ రెడ్డి,డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి,ఆర్ఐ విష్ణు,సర్వేయర్ అరుణజ్యోతి, ఉపసర్పంచ్ ఉప్పునూతల వెంకన్న, పంచాయతీ కార్యదర్శి గీత,జీపీఓ లింగయ్య, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# క్రీడా ప్రాంగణంలో కనీస వసతులు కల్పించాలి

నిజామాబాద్, జులై 17:మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల తెలంగాణ క్రీడా ప్రాంగణంలో కనీస వసతులు కల్పించాలని టిజీవిపి మండల అధ్యక్షులు భరత్ రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ సచివాలయ కార్యదర్శి మహేష్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రాంగణంలో గడ్డి పెరగడం వల్ల క్రీడాకారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాత్రివేళలో లైట్లు లేకపోవడంతో క్రీడలు ఆడలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన చెప్పారు. క్రీడా ప్రాంగణాన్ని తక్షణమే శుభ్రం చేయించి లైట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. క్రీడాకారులు ఆడుకోవడానికి వాలీబాల్ నెట్ ఏర్పాటు చేయాలని ఆయా తెలిపారు. కార్యక్రమంలో టీజీవిపి ప్రతినిధులు విజయ్, రోహన్, మనోజ్, సన్నీ, ధనుష్, ప్రణయ్, యోగి, ఓంకార్, అఖిల్ ఉన్నారు.

# ఏ ఒక్క కార్మికుడు వెనుకబడిపోకుండా చూసేందుకు కట్టుబడి ఉన్నాం

**– హైదరాబాద్‌లో జరిగిన 12వ బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశంలో డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ**

న్యూఢిల్లీ, జులై 17:బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోన్న భారత్ నాయకత్వంలో హైదరాబాద్‌లో కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశం విజయవంతంగా జరిగింది. భవిష్యత్తు కార్మిక రంగాన్ని ప్రభావితం చేసే కీలక అంశాలపై చర్చించడానికి బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు, వివిధ ప్రతినిధులు, కార్మిక-యజమానుల సంఘాలు, విజ్ఞాన భాగస్వాములు ఈ సమావేశంలో ఒక చోటికి చేరారు.

భారతదేశం అధ్యక్షత వహించిన ఈ సమావేశం 'దృఢత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం తయారీ' ఇతివృత్తంతో జరిగింది. సామాజిక భద్రత, కార్మిక మార్కెట్ క్రమబద్ధీకరణ, ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి, సమగ్రమైన- దృఢత్వం కలిగిన కార్మిక మార్కెట్ల కోసం డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటి రంగాల్లో ఉమ్మడి చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది.

హైదరాబాద్‌కు విచ్చేసిన వివిధ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలుకుతూ కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ కీలకోపన్యాసం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత మార్గదర్శకత్వంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్.. 'ప్రజా కేంద్రక' విధానం, 'మానవత్వమే ప్రథమం' అనే స్ఫూర్తితో సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

భారత్ సాధించిన సంస్కరణల ప్రస్థానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ పాతబడిపోయిన 29 కార్మిక చట్టాలను క్రోడీకరించి 2025 నవంబర్‌లో నాలుగు ఆధునిక కార్మిక కోడ్‌లుగా రూపొందించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. భారతదేశంలోని 140 కోట్ల ప్రజల కోసం కార్మిక కేంద్రక వ్యవస్థను సృష్టించిన ఒక మైలురాయి లాంటి చారిత్రాత్మక సంస్కరణగా దీనిని ఆయన అభివర్ణించారు.

నమోదైన 31.7 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులకు ప్రత్యేక గుర్తింపు, డూప్లికేషన్ నివారణ, సంక్షేమ ప్రయోజనాలు సజావుగా అందేలా 'ఈ-శ్రమ్' పోర్టల్ దోహదపడిందని మంత్రి పేర్కొన్నారు. 'నేషనల్ కెరీర్ సర్వీస్' (ఎన్‌సీఎస్) పోర్టల్.. ఉద్యోగాల ఎంపిక, నైపుణ్యాల గుర్తింపు, కౌన్సెలింగ్‌లను ఏకీకృతం చేస్తుందని ఆయన చెప్పారు. భారతదేశపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సౌలభ్యవంతమైన రూపకల్పన వల్ల ప్లాట్‌ఫామ్ కార్మికులు వంటి కొత్త శ్రేణి కార్మికులకు కూడా సేవలను వేగంగా విస్తరించడానికి వీలు కలుగుతోందని తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మారిషస్ వంటి భాగస్వామ్య దేశాలతో కూడా భారత్ పంచుకుందని ఆయన అన్నారు.

భారత్‌కు చెందిన నైపుణ్యం గల, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని ప్రపంచ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా అంతర్జాతీయ కార్మిక రాకపోకల సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి దేశం నిరంతరం చేపడుతున్న చర్యలను డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రధానంగా చెప్పారు. భారత్‌లో ప్రస్తుతం 2,100 కంటే ఎక్కువ జీసీసీలు (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు) ఉన్నాయని.. ఇవి 23.5 లక్షల మంది నిపుణులకు ఉపాధి కల్పిస్తూ ఏటా దాదాపు 98 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

ఉత్పాదకత, సమానత్వంతో కూడిన భవిష్యత్తు కార్మిక రంగాన్ని తీర్చిదిద్దే బాధ్యతను బ్రిక్స్ దేశాలు పంచుకుంటున్నాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. "గ్లోబల్ సౌత్ దేశాలు ఆచరణాత్మకమైన, సమగ్రమైన, ప్రజా కేంద్రకమైన పరిష్కారాలను రూపొందించుకోవడానికి ఈ బ్రిక్స్ వేదిక ఒక విశిష్టమైన అవకాశాన్ని అందిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ సదస్సుకు పంపించిన వీడియో సందేశంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) డైరెక్టర్ జనరల్... బ్రిక్స్ ఎజెండాలో కార్మిక, ఉపాధి రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చినందుకు భారత నాయకత్వాన్ని అభినందించారు. గత దశాబ్ద కాలంలో అత్యంత వేగవంతమైన విస్తరణను సాధించిన భారతదేశపు బలమైన సామాజిక భద్రతా వ్యవస్థను ఆయన కొనియాడారు. "ఐఎల్‌ఓ తాజా అంచనాల ప్రకారం భారతదేశ సామాజిక భద్రతా వ్యవస్థ ఇప్పుడు ఏకంగా 100 కోట్ల మంది ప్రజలకు రక్షణ కల్పిస్తోంది. ఈ ఘనత 'సౌత్-సౌత్ సహకారం' ద్వారా ఇతర దేశాలు కూడా నేర్చుకోదగ్గ ఎన్నో పాఠాలను అందిస్తోంది" అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడం, సామాజిక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, సమగ్ర వృద్ధికి మద్దతు ఇవ్వడం, కార్మిక- ఉపాధి రంగాలలో సహకారాన్ని మరింత పెంపొందించడంపై బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తూ ఈ సమావేశంలో 'బ్రిక్స్ కార్మిక- ఉపాధి మంత్రుల ప్రకటన'ను ఆమోదించడం ఒక ప్రధాన నిర్ణయంగా నిలిచింది. ఉమ్మడి కార్మిక మార్కెట్ సవాళ్లను పరిష్కరించడంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య 'సౌత్-సౌత్ సహకారం', పరస్పర అభ్యసనం, ఆచరణాత్మక భాగస్వామ్యం ప్రాముఖ్యతను ఈ ప్రకటన పునరుద్ఘాటించింది.

సామాజిక భద్రతను పెంపొందించడం, కార్మిక మార్కెట్ల క్రమబద్ధీకరణ అనే ప్రాధాన్యత 1 కింద సామాజిక భద్రతా పరిధిని విస్తరించడంలో ఉమ్మడి ప్రయత్నాలను అభినందించడానికి సభ్య దేశాలు అంగీకరించాయి. తమ దేశీయ పరిస్థితులు, ప్రాధాన్యతలు, సామర్థ్యాల ఆధారంగా జాతీయంగా నిర్దేశించుకున్న స్థాయిల ప్రకారం ప్రస్తుత స్థాయిల నుంచి సామాజిక భద్రతా పరిధిని క్రమంగా విస్తరించడానికి సభ్య దేశాలు కృషి చేస్తాయి.

శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం, సమగ్రతను పెంపొందించడం అనే ప్రాధాన్యత 2 కింద నైపుణ్యాభివృద్ధికి విస్తృత కవరేజీ కల్పించడం, తల్లిదండ్రుల సెలవు విధానాలు, పని ప్రదేశాలలో వేధింపులు, వివక్షల నుంచి రక్షణ కల్పించడం ద్వారా మహిళలకు సాధికారత చేకూర్చే విధానపరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి సభ్య దేశాలు కట్టుబడి ఉన్నాయి. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో నాయకత్వ పాత్రలో మహిళల ప్రాతినిధ్యాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేస్తాయి.

ఉపాధి సామర్థ్యం, నైపుణ్యాల గుర్తింపు- అభివృద్ధిపై సహకారం అనే ప్రాధాన్యత 3 కింద బ్రెజిల్ మద్దతుతో భారతదేశ భాగస్వామ్యంతో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నిర్వహిస్తున్న 'వృత్తుల అంతర్జాతీయ సూచన వర్గీకరణ'పై కొనసాగుతున్న సాధ్యసాధ్యాల అధ్యయనాన్ని సభ్య దేశాలు గుర్తించాయి. డిజిటల్, సంరక్షణ రంగం, పర్యావరణ అనుకూల వంటి కీలక రంగాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుల్లో పాల్గొనడాన్ని పరిశీలించాల్సిందిగా సభ్య దేశాలను ప్రోత్సహించాయి.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహా శ్రామికులందరి కోసం డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం అనే ప్రాధాన్యత 4 కింద విస్తృతమైన సంప్రదింపులు, ఉమ్మడి సహకారం, భాగస్వామ్య ప్రయోజనాలతో కూడిన సహచరుల నుంచి నేర్చుకోవడం (పీర్ లెర్నింగ్).. 'సౌత్-సౌత్, త్రైపాక్షిక సహకారం' ద్వారా విజ్ఞానాన్ని, అనుభవాలను పంచుకోవడానికి మన డిజిటల్ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, మార్పు ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్లను తగ్గించడానికి సభ్య దేశాలు కలిసి పనిచేస్తాయి.

ఈ సమావేశంలో బ్రిక్స్ దేశాల మధ్య సాంకేతిక సహకారం, విజ్ఞాన మార్పిడి, సామర్థ్య పెంపొందింపును బలోపేతం చేసే లక్ష్యంతో భారత్ ప్రతిపాదించిన ఒక ముఖ్యమైన వ్యవస్థాగత కార్యక్రమం అయిన 'బ్రిక్స్ కనెక్ట్'ను కూడా ప్రారంభించారు. ఇది కార్మిక మార్కెట్ సమాచారాన్ని మెరుగుపరచడం, నైపుణ్యాల అంచనాకు మద్దతు ఇవ్వడం, భవిష్యత్ నైపుణ్యాలు, డిజిటల్ ఉపాధి సేవలు, సామాజిక భద్రత, కార్మిక మార్కెట్ సంస్కరణల రంగాల్లో సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలలో అత్యుత్తమ విధానాలను పంచుకోవడానికి, విజ్ఞాన మార్పిడికి ఒక ఉమ్మడి వేదికగా పనిచేస్తుందని భావిస్తున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని కేవలం విధానపరమైన చర్చలకే పరిమితం చేయకుండా కార్యాచరణ ఆధారిత, దేశాల అవసరాలకు అనుగుణమైన ఉమ్మడి భాగస్వామ్యంగా ముందుకు తీసుకెళ్లే దిశగా ఇదొక కీలక అడుగు అని పేర్కొంటూ సభ్య దేశాలు ఈ కార్యక్రమాన్ని స్వాగతించాయి.

ఈ సమావేశంలో బ్రిక్స్ దేశాల ప్రతినిధి బృందాలు తమ జాతీయ ప్రకటనలను సమర్పించాయి. ఈ సందర్భంగా ఆయా దేశాలు తమ ప్రాధాన్యతలను, సాధించిన విజయాలను, విధానపరమైన కోణాలను ప్రముఖంగా ప్రస్తావించాయి. నైపుణ్యాభివృద్ధి, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, ఉద్యోగాన్ని కోల్పోయే విషయంలో రక్షణ.. మహిళలు, దివ్యాంగులు, మారుమూల ప్రాంతాల ప్రజల కోసం సమగ్ర ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల ప్రాధాన్యతను ఇండోనేషియా ప్రధానంగా చెప్పింది. బ్రిక్స్ పరిధిలో పరస్పర చర్చలు, సహకారం ప్రాముఖ్యతను ఇరాన్ స్పష్టం చేసింది. ప్రైవేట్ రంగ భాగస్వామ్యం, సరళమైన చట్టపరమైన నియంత్రణలు, అంతర్జాతీయ ప్రతిభను ఆకర్షించడం, కార్మిక పరిపాలన కోసం డిజిటల్ సాంకేతికతలతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం ప్రతిపాదికన చేపట్టిన కార్మిక మార్కెట్ సంస్కరణలను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రముఖంగా వివరించింది. 'బ్రిక్స్ కనెక్ట్'ను ఒక విశిష్ట వ్యవస్థాగత ఆవిష్కరణగా దక్షిణాఫ్రికా కొనియాడింది. ఇది కేవలం విధానపరమైన చర్చలకే పరిమితం కాకుండా మరింత ఉత్పాదకత, సమగ్రత, సమానత్వంతో కూడిన ఉమ్మడి కార్మిక మార్కెట్ దిశగా భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తుందని పేర్కొంది.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణమైన వృత్తి విద్యా విధానాన్ని, 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇథియోపియా తెలిపింది. బ్రిక్స్ భాగస్వామ్య దేశాల నుంచి నేర్చుకుంటూ 'సౌత్-సౌత్ సహకారం' స్ఫూర్తితో ఉమ్మడి లక్ష్యాల సాధనకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. తమ దేశంలో తగ్గుతున్న నిరుద్యోగిత రేటు, ఈ రంగం డిజిటలైజేషన్, చెల్లింపుల కోసం ఎలక్ట్రానిక్ అప్లికేషన్ల ప్రవేశపెట్టడం వంటి పురోగతిని రష్యా పంచుకుంది. లక్షలాది మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చే తమ 'మైక్రో-ఇంటర్న్‌షిప్' కార్యక్రమాన్ని బ్రెజిల్ ప్రముఖంగా ప్రస్తావించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో సహకారాన్ని మరింత విస్తరించాలని ఆ దేశం కోరింది. ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి, నూతన పని విధానాలను చైనా వివరించింది. ఏకాభిప్రాయంతో ఈ సంయుక్త ప్రకటనను ఆమోదించడాన్ని ఆ దేశం స్వాగతించింది.

ఈ సమావేశంలో భాగంగా 'అత్యుత్తమ విధానాలపై' ఒక ప్రత్యేక సాంకేతిక సెషన్‌ను కూడా నిర్వహించారు. ఇందులో సభ్య దేశాలు తమ ఆచరణాత్మక అనుభవాలు, జాతీయ ఆవిష్కరణలను పరస్పరం పంచుకున్నాయి. కార్మిక- యజమానుల ప్రతినిధులు సైతం ఈ చర్చలలో చురుగ్గా పాల్గొని సామాజిక న్యాయం, గౌరవప్రదమైన పని, మానవ గౌరవం, మానవ కేంద్రక సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ).. అందరికీ సామాజిక భద్రత- సంక్షేమ ప్రయోజనాల బదిలీ సౌలభ్యం.. నిరంతర నైపుణ్యాభివృద్ధి, పూర్వ అభ్యసన గుర్తింపు, భవిష్యత్ కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు.

కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తన ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. ఈ సమావేశంలో ఆమోదించిన ఉమ్మడి ప్రకటనను సామూహిక ప్రయత్నాల విజయంగా, చర్చలను నడిపించిన ఏకాభిప్రాయ స్ఫూర్తికి ప్రతీకగా అభివర్ణించారు. "ఏ ఒక్క కార్మికుడు వెనుకబడిపోకుండా చూస్తూ క్రమబద్ధమైన, సమగ్రమైన, లింగ సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చే, డిజిటల్ పరంగా సాధికారత సాధించిన, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేలా దృఢత్వం కలిగిన కార్మిక మార్కెట్లను నిర్మించడానికి మేం పూర్తి విశ్వాసంతో, నిబద్ధతతో ఉన్నాం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

సాంకేతిక చర్చలకు మద్దతు ఇవ్వడంలో, చర్చలను మరింత సుసంపన్నం చేయడంలో అంతర్జాతీయ విజ్ఞాన భాగస్వాములైన ఐఎల్‌ఓ, ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ అసోసియేషన్ (ఐఎస్ఎస్ఏ), ఐక్యరాజ్యసమితి రెసిడెంట్ కోఆర్డినేటర్ కార్యాలయం (యూఎన్ఆర్‌సీఓ) అందించిన విలువైన సహకారాన్ని కూడా ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన భారతదేశం అభినందించింది.

ఈ సంయుక్త ప్రకటనను విజయవంతంగా ఆమోదించటం, 'బ్రిక్స్ కనెక్ట్' ఆవిష్కరణ.. కార్మిక- ఉపాధి రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంలో ఒక గణనీయమైన ముందడుగుగా నిలిచాయి. సామాజిక న్యాయం, గౌరవప్రదమైన ఉపాధి, ఆవిష్కరణ, దృఢత్వం, అందరికీ సమగ్ర అభివృద్ధిని పెంపొందించే దిశగా. శ్రామిక ప్రపంచం కోసం ఉమ్మడిగా కలిసి పనిచేయాలనే దృఢ సంకల్పంతో ఈ సమావేశం ముగిసింది.

# బ్రిక్స్ మంత్రులతో కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ద్వైపాక్షిక సమావేశాలు



న్యూఢిల్లీ, జులై 17:బ్రిక్స్ కార్మిక, ఉపాధికల్పన మంత్రుల 12వ సమావేశాన్ని హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించారు. బ్రిక్స్‌కు ఈ సంవత్సరం భారత్ అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రులు, బ్రిక్స్ దేశాల ప్రతినిధివర్గాల సారథులు, యాజమాన్య సంస్థలు, కార్మిక సంస్థల ప్రతినిధులతో పాటు జ్ఞాన మార్పిడి ప్రక్రియలో పాలుపంచుకుంటున్న భాగస్వామ్య వర్గాలు కూడా పాల్గొన్నాయి. కార్మిక రంగ భవిష్యత్తు రూపురేఖలను నిర్దేశించే కీలక కార్మిక, ఉపాధికల్పన, సామాజిక భద్రత సంబంధిత అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

ఈ సమావేశం ముగిసిన తరువాత ఇండొనేషియా, ఇరాన్, రష్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మంత్రులతోనూ, అంతర్జాతీయ సామాజిక భద్రత సంఘం (ఐఎస్ఎస్ఏ) ప్రతినిధులతోనూ కేంద్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించారు.

కార్మిక మార్కెట్లను మరింత సమ్మిళితంగా, సమర్థంగా తీర్చిదిద్దడానికి డిజిటల్ వనరులను సద్వినియోగపరుచుకోవడం అనే అంశంపై నేతలు చర్చించారు. భారత్ ఈ-శ్రమ్, నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్ఎస్) వంటి వెబ్‌సైట్లతో డిజిటల్ రంగంలో ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రధానంగా ప్రస్తావించింది. ఇవి ప్రజల ప్రయోజనాలను సంరక్షించడం, ఉద్యోగకల్పనకు సంబంధించిన సేవలను అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో కార్మికుల రాకపోకలను ప్రోత్సహిస్తున్నాయని వివరించింది. చర్చలలో ప్రధానంగా నైపుణ్య సాధననూ, కార్మికులకు సంబంధించిన వివిధ పథకాలనూ, డిజిటల్ రంగంలో కొత్త ఆవిష్కరణలనూ విస్తరించడానికి 'బ్రిక్స్ కనెక్ట్' కార్యక్రమంతో అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పరస్పర సహకారాన్ని పటిష్ఠపరుచుకోవాలనే అంశాలను ప్రస్తావించారు.

యూఏఈ మానవ వనరులు, ఎమిరేటీకరణ శాఖ మంత్రి డాక్టర్ అబ్దుల్‌రహ్మాన్ అల్ అవార్ మాట్లాడుతూ, "కార్మికుల రాకపోకలను బలోపేతం చేయడం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లో భారత్ సాధించిన ప్రగతి, ఈ రంగంలో భవిష్యత్తులో సహకరించుకోవడానికి ఉన్న అవకాశాలపై ముఖ్యంగా చర్చించాం" అన్నారు. "వృత్తులకు సంబంధించిన అంతర్జాతీయ సూచనల వర్గీకరణను రూపొందించేందుకు భారత్, ఐఎల్‌ఓలు ప్రస్తుతం నిర్వహిస్తున్న సాధ్యాసాధ్యాల అధ్యయనంలో పాలుపంచుకోవాల్సిందిగా యూఏఈని కూడా ఆహ్వానించారు" అని ఆయన అన్నారు. "అంతర్జాతీయ స్థాయిలో సందర్భశుద్ధి కలిగిన వృత్తుల వర్గీకరణ ప్రాథమిక ప్రణాళికను రూపొందించడానికి కలిసికట్టుగా పనిచేయడం ఎంతైనా ముఖ్యం" అని కూడా ఆయన అన్నారు.'మరిన్ని విధాన ప్రధాన చర్చలు, నైపుణ్యాభివృద్ధిలో సహకారం, కార్మిక రంగ పరిపాలన కోసం డిజిటల్ సేవల వినియోగం వంటి పద్ధతుల్లో ఉద్యోగకల్పన, సామాజిక పరిరక్షణ రంగాల్లో భారత్, రష్యా భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై సమావేశంలో మాట్లాడుకున్నాం" అని రష్యా కార్మిక, సామాజిక పరిరక్షణ శాఖ మంత్రి శ్రీ ఎంటోన్ కొత్యకొవ్ అన్నారు. "వృత్తులకు సంబంధించిన అంతర్జాతీయ సూచనల వర్గీకరణను రూపొందించేందుకు భారత్, ఐఎల్‌ఓలు ప్రస్తుతం నిర్వహిస్తున్న సాధ్యాసాధ్యాల అధ్యయనంలో భాగం పంచుకోవాల్సిందిగా రష్యాను ఆహ్వానించారు" అని ఆయన అన్నారు. "రెండు దేశాల మధ్య సామాజిక భద్రత ఒప్పందం (ఎస్ఎస్ఏ)ను కుదుర్చుకొనేందుకు అవకాశం ఉందేమో పరిశీలించాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది" అని శ్రీ కొత్యకొవ్ అన్నారు.

ఇండొనేషియా సిబ్బంది శాఖ మంత్రి శ్రీ యాస్సియరలీ మాట్లాడుతూ, "సమావేశం ఉద్యోగకల్పన, సిబ్బందికి శిక్షణనివ్వడం, డీపీఐ రంగాల్లో భారత్, ఇండొనేషియయా సహకారాన్ని విస్తరించుకొనే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చించాం" అని పేర్కొన్నారు. "డిజిటల్ మాధ్యమాన్ని ఉపయోగించి ప్రజలకు అందించే సేవల పరిధిని పెంచుకోవడంలో సంపాదించిన అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి సిద్ధమంటూ భారత్ ముందుకు వచ్చింది. మా కార్మిక సంబంధిత, ఉద్యోగకల్పన సంబంధిత సేవలను బలోపేతం చేయడానికి డిజిటల్ సాంకేతికతలను ఇండొనేషియా ఉపయోగించుకొనేలా సహకరిస్తామంటూ కూడా భారత్ సుముఖతను వ్యక్తం చేసింది" అని ఆయన అన్నారు.

ఇరాన్ సహకార సంఘాలు, కార్మిక, సమాజ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అహ్మద్ మేదారీ మాట్లాడుతూ, "ఈ సమావేశంలో ఉద్యోగకల్పన, కార్మిక పరిపాలన, డిజిటల్ పరివర్తన రంగాల్లో భారత్, ఇరాన్ సహకారాన్ని విస్తరించుకోవడానికి ఉన్న అవకాశాలను సమీక్షించారు. డీపీఐని తీర్చిదిద్దడంలో తనకున్న అనుభవాన్ని భారత్ పంచుకుంది. కార్మిక, ఉద్యోగకల్పన సంబంధిత సేవలను పటిష్ఠపరచడానికి సాంకేతికత ఆధారిత సేవలను ప్రవేశపెట్టుకోవడంలో ఇరాన్‌కు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని కూడా భారత్ తెలిపింది" అని పేర్కొన్నారు.

ఐఎస్ఎస్ఏకు చెందిన డాక్టర్ మొహమ్మద్ అజ్మాన్ మాట్లాడుతూ, "చర్చల్లో సామాజిక భద్రత వ్యవస్థలను ముందుకు తీసుకు పోవడానికీ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ పద్ధతులను మార్పిడి చేసుకోవడాన్ని ప్రోత్సహించడానికీ భారత్, ఐఎస్ఎస్ఏ మధ్య సహకారాన్ని పటిష్ఠపరిచే అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు. 2025లో సామాజిక భద్రత పరిధిని విస్తరించడంలో భారత్ ఘన విజయాలకు గుర్తింపుగా ఐఎస్ఎస్ఏ పురస్కారాన్ని అందించిన విషయాన్ని గౌరవ మంత్రి ప్రస్తావించారు. భారత్ అందిస్తున్న సామాజిక భద్రత ప్రయోజనాల పరిధిలోకి వచ్చిన వారి సంఖ్య 2026లో 100 కోట్లను మించింది. అందరికీ సామాజిక భద్రతను అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది" అన్నారు.

మొత్తంమీద, ఈ ద్వైపాక్షిక సమావేశాలూ, చర్చలూ ఆచరణ పూర్వక సహకారం, అత్యుత్తమ పద్ధతుల మార్పిడి, సమ్మిళిత, దృఢతర, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి సన్నద్ధంగా ఉండేలా కార్మిక రంగాన్ని ప్రోత్సహించడానికి ఒక వేదికగా బ్రిక్స్ కనెక్ట్‌ను చూస్తూ, 'బ్రిక్స్ కనెక్ట్'కు విస్తృత మద్దతును అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాయి.

కేంద్ర కార్మిక, ఉద్యోగకల్పన శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె నిర్వహించిన ద్వైపాక్షిక సమావేశాల్లో ఈ కింది అంశాలు ప్రస్తావనకు వచ్చాయి:

బ్రెజిల్ కార్మిక, ఉద్యోగకల్పన ఉప మంత్రి శ్రీ ఫ్రాన్సిస్కో మాసెన డ సిల్వ మాట్లాడుతూ "నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ ఉద్యోగకల్పన సేవలు, కార్మిక మార్కెట్టుకు సంబంధించిన సమాచార వ్యవస్థలు, సామాజిక భద్రత రంగాల్లో సహకరించుకోవడం ద్వారా భారత్, బ్రెజిల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చలు ప్రధానంగా దృష్టి పెట్టాయి" అన్నారు. "వృత్తులకు సంబంధించిన అంతర్జాతీయ సూచనల వర్గీకరణను రూపొందించేందుకు భారత్, ఐఎల్‌ఓలు ప్రస్తుతం నిర్వహిస్తున్న సాధ్యాసాధ్యాల అధ్యయనంలో బ్రెజిల్ భాగం పంచుకోవడాన్ని ప్రశంసించారు" అని ఆయన అన్నారు. "జ్ఞానాన్ని పంచుకోవడం, సామర్థ్యాలను పెంచుకోవడం.. ఈ రెండు విధాలుగానూ 'బ్రిక్స్ కనెక్ట్' పురోగతికి తోడ్పడాలన్న ఆసక్తిని ఇరు పక్షాలూ పునరుద్ఘాటించాయి" అని కూడా శ్రీ సిల్వ అన్నారు.

చైనా మానవ వనరులు, సామాజిక భద్రత శాఖ ఉప మంత్రి శ్రీ యూ జియాడోంగ్ మాట్లాడుతూ, "రాబోయే కాలానికి అవసరపడే నైపుణ్యాలు, డిజిటల్ ఉపాధికల్పన సేవలు, కార్మిక రంగ పరిపాలన, సామాజిక భద్రత రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై ప్రధానంగా చర్చించారు" అన్నారు. "మహిళా సిబ్బంది భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే, కార్మిక రంగంలో డిజిటల్ సేవలను పెంచే దిశగా భారత్ అమలుచేస్తున్న కార్యక్రమాలకు ప్రశంసలు లభించాయి. 'బ్రిక్స్ కనెక్ట్' పురోగతికి తోడ్పడడంతో పాటు సమ్మిళిత, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి సన్నద్ధంగా ఉండేలా కార్మిక రంగాన్ని ప్రోత్సహించాలన్న ఆసక్తిని ఇరు పక్షాలూ పునరుద్ఘాటించాయి.

తీర్మానాన్ని విజయవంతంగా ఆమోదించడంతో పాటు 'బ్రిక్స్ కనెక్ట్'ను ప్రారంభించి కార్మిక రంగం, ఉద్యోగకల్పన రంగాల్లో బ్రిక్స్ సహకారాన్ని బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగును వేశారు. సామాజిక న్యాయాన్నీ, గౌరవపూర్వక ఉపాధికల్పననీ, నూతన ఆవిష్కరణల్నీ, దృఢత్వాన్నీ, అభివృద్ధి ఫలాలను అందరికీ అందించడాన్నీ ప్రోత్సహించే దిశగా కలిసికట్టుగా కృషి చేయాలన్న ఉమ్మడి సంకల్పంతో సమావేశాన్ని ముగించారు.

## కపాలినీ క్రమంలో భద్రకాళీ ఉత్సవాలు



ములుగు, జులై 17: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో శాకంబరీ నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఉదయం అమ్మవారు కపాలినీ క్రమంలో సాయంత్రం భగమాలినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిత్యాహ్నికం నిర్వహించి, దీక్షా హెూమం, చతుస్థానార్జన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తుదు దర్శించుకున్నారు.

## వరంగల్ నగరంలో భారీ వర్షం

వరంగల్, జులై 16:వరంగల్ నగరంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షాల ప్రభావంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.

## రేషన్ కార్డులకు ఈ-కేవైసీ తప్పనిసరి.. నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి

నిజామాబాద్, జులై 17: రేషన్ కార్డు లబ్ధిదారులకు పౌరసరఫరాల శాఖ మరోసారి కీలక సూచనలు జారి చేసింది. ఈ కేవైసీ విషయంలో లబ్ధిదారులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నది. ఇప్పటివరకు ఈ-కేవైసీ చేసుకొని లబ్ధిదారులు తమ రేషన్ కార్డులు వెంటబెట్టుకొని వెంటనే సంబంధిత డీలర్లను కలవాలని సూచించింది.

ఉచితంగా ఈ-కేవైసీ చేసుకునేందుకు జూలై 31 వరకు గడువు ఉందని నిజామాబాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. ఈ-కేవైసీ చేసుకొని లబ్ధిదారులకు భవిష్యత్‌లో సరుకు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులందరూ వెంటనే తమ రేషన్ కార్డులను ఈ-కేవైసీ చేసుకోవాలని తెలిపారు.

# రామప్పలో గోదావరి పరవళ్లు

ములుగు, జులై 17: (నేటినిజం ప్రతినిధి): గోదావరి జలాలను పంపింగ్ చేసి రిజర్వాయర్‌లోకి తరలించాలని బీఆర్ఎస్ చేసిన పోరాట ఫలితంతో రామప్పకు జలకళ వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముందు చూపుతో గోదావరి నదిపై ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో దేవాదుల పంపు హౌస్‌లోని ఏడు మోటర్ల ద్వారా భీమ్‌ఘనపురం రిజర్వాయర్‌లోకి, అక్కడి నుంచి రామప్ప సరస్సుకు జలాలు తరలుతున్నాయి.

గత రెండు రోజుల నుంచి రెండు మోటర్ల ద్వారా రోజుకు 100 ఎంసీఎఫ్‌టీల నీరు పరుగులు పెడుతోంది. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీ పక్షాన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు గోదావరి జలాల వినియోగంపై జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయడంతో ఈ నెల 13వ తేదీన దేవాదుల పంప్‌హౌస్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పంపు హౌస్‌లోని 10 మోటర్లను నడిపి ఆయకట్టులోని రిజర్వాయంన్నింటిలోకి గోదావరి నీటిని పంపింగ్ చేస్తామని అన్నారు. రామప్ప సరస్సు పూర్తి స్థాయి నీటి మట్టం 36అడుగులు కాగా ప్రస్తుతం 26ఫీట్లకు చేరుకుంది. గోదావరిలో నీటి లభ్యతను భట్టి దేవాదుల పంపుహౌస్ ద్వారా నీటిని పంపింగ్ చేయనున్నారు.

ప్రస్తుత కరువులో సమ్మక్క సాగర్ స్టోరేజ్ వాటర్ కల్పతరువుగా మారింది. గోదావరి జలాలను రామప్పలోకి తరలిస్తుండడంతో 365 రోజులు సరస్సు జలకళతో కనువిందు చేస్తున్నది. తాగు, సా గుకు సరస్సు నీటిని వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం ఫిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేయగా మిషన్ భగీరథ కింద 239 ఎంసీఎఫ్టీలు వినియోగించనున్నారు. రామప్ప పరిధిలో వెంకటాపూర్, ములుగు, గణపురం మండలాల్లోని పలు గ్రామాల్లో అధికారికంగా 5,150 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుండగా, అనధికారంగా మరో 5 వేల ఎకరాలు సాగవుతున్నది. నర్సంపేట నియోజకవర్గంలోని రంగాయ చెరువును నింపి అకడి నుంచి ఖానాపురం మండలం పాకాల సరస్సుకు 1,050 ఎంసీఎఫ్టీల జలాలను వేసవిలో తరలించేం దుకు నిర్ణయించారు. భూపాల పల్లి నియోజకవర్గంలోని గణపు రం చెరువును నింపనున్నారు.

అలాగే ఇకడ ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పంప్ హౌస్ నుంచి ములుగు జిల్లాలోని ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, మల్లంపల్లితో పాటు గణపురం మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరందించనున్నారు. కాగా, గత జనవరిలో మేడారం లో జరిగిన మంత్రివర్గ సమావే శంలో ములుగు మండలం లోని 14 గ్రామాలకు సాగు నీరం దించేందుకు రూ.200 కోట్లు సీఎం మంజూరు చేయగా సంబ ంధిత పనులు కొనసాగుతు న్నాయి. రామప్ప నుంచి లక్నవ రం సరస్సు గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులకు సంబంధించిన భూమి ని సైతం అధికారులు త్వరలో సేకరించి లక్నవరం సరస్సులోకి సైతం గోదావరి జలాలను తరలించనున్నారు.

# సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయిత రెంటాల

రెంటాల గోపాలకృష్ణ ,( 5 సెప్టెంబర్ 1920 -18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి.

పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది.

సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది.




అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి.

విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి.

సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది.

అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు.

రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు.

రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచిపోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది.

## పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, జులై 17:పల్నాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధమిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు(శుక్రవారం) నరసరావుపేటలో క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణపత్రాలను అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలని ఆకాంక్షించారు. 15 వేల మంది డ్వాక్రా మహిళలకు, 13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించామన్నారు. అలాగే పల్నాడు జిల్లాలో 5 లక్షల మందికి రుణాలు అందజేసినట్లు వెల్లడించారు.

రైతులు, విద్యార్థులు..అర్హులైన అందరికీ రుణం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్లి రుణాలు అందించడం గర్వకారణమన్నారు. బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములని చెప్పుకొచ్చారు. రైతు భవిష్యత్తును మార్చడానికి ఈ రుణాలు ఉపయోగకరమన్నారు. వికసిత్ భారత్ 2024కు అనుగుణంగా సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకొచ్చారన్నారు. జనధన్ యోజన ద్వారా కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలిచ్చారని చెప్పారు. జీఎస్టీ శ్లాబ్‌లు ఎక్కువ ఉండేవని.. చాలామంది నష్టపోయారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కేదార్‌నాథ్‌లో విరిగిపడ్డ కొండచరియలు



న్యూ ఢిల్లీ, జులై 17:కుండపోత వర్షాల కారణంగా కేదార్‌నాథ్ పాదయాత్ర మార్గంలో గౌరీకుండ్ కు వెళ్లే దారిలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.

ప్రస్తుతం శిథిలాలను తొలగించే పనులు అధికారులు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, ప్రయాణ మార్గం సురక్షితమని తెలిపిన తరువాతే యాత్ర ప్రారంభమవుతుంది. పనులు పూర్తయ్యేవరకు యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి రాజ్వార్ సూచించారు. అనవసర ప్రయాణాలు మానుకొని, పరిపాలన యంత్రాంగం జారీ చేసిన సూచనలను పాటించాలని కోరారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున భక్తులు కేదార్‌నాథ్ యాత్రను కొన్ని రోజులు వాయిదా వేసుకుంటే మంచిదని తెలిపారు.

## ఏ ఒక్క ఉద్యమకారుడిని విస్మరించవద్దు : గుడిమల్ల రవికుమార్



హన్మకొండ, జులై 17:(నేటినిజం ప్రతినిధి)తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఏ ఒక్క ఉద్యమకారుడిని విస్మరించవద్దని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ అడ్వకేట్ గుడిమళ్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో కమిటీకి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ చర్యలపై వారు వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ ప్రాణాలు, ఆరోగ్యం, ఆర్థిక స్థితి త్యాగం చేసిన వేలాది మంది ఉద్యమకారుల పోలీసు రికార్డులు, మీడియా వార్తలు, కమిటీ పరిశీలన ఆధారంగా ఉద్యమకారుల పూర్తి జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ప్రతి గుర్తింపుపొందిన ఉద్యమకారుడికి 250 గజాల స్థలం కేటాయించాలని, రూ.25 వేల పెన్షన్ మంజూరు చేయాలని, వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. రూ.5 వేల కోట్లతో ఉద్యమకారుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి శాశ్వత సంక్షేమ చర్యలు చేపట్టాలని, ఉచిత బస్పాస్, ఆరోగ్య బీమా, ప్రాధాన్య వైద్య సేవలు, గుర్తింపు పొందిన ఉద్యమకారులకు 3 బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చాం

**- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్**

న్యూ ఢిల్లీ, జులై 17: ప్రతి గ్రామానికీ బ్యాంక్ సేవలు అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. నరసరావుపేట నిర్వహించిన క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014 నుంచి గ్రామాలకు బ్యాంక్ సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిరర్థక ఆస్తులతో బ్యాంకుల పనితీరు బాగుండేది కాదని.. బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చామన్నారు. తోపుడు బండ్ల వారికి గ్యారంటీ లేకుండా బ్యాంకు లోన్లు వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే వారికి అండగా నిలబడి లోన్లు అందజేసిందన్నారు.

బ్యాంకు నుంచి లోన్లు తీసుకోవాలనే ఆలోచన గతంలో చాలామందికి ఉండేది కాదని కేంద్ర మంత్రి తెలిపారు. మోదీ సూచనలతో ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్తున్నాయన్నారు. దీని వల్ల ఈరోజు లక్షల మందికి సులువుగా లోన్లు అందుతున్నాయని చెప్పారు. కేవలం నరసరావుపేటతోనే ఆగేది లేదని.. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా చాలా చేస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ నేతలు చెప్పిన వారికి మాత్రమే బ్యాంకర్లు లోన్లు ఇచ్చేవారని.. వాళ్లు తిరిగి చెల్లించకపోవటంతో ఎన్నో ఇబ్బందులు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఇప్పుడు గ్రామగ్రామానికి బ్యాంకులు వెళ్లి అక్కడ ప్రజల అవసరాలను కనుక్కుని లోన్లు ఇస్తున్నారని తెలిపారు. అర్హత ఉన్న వారికి తప్పకుండా లోన్లు వచ్చేలా చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టనున్న ఢిల్లీ

న్యూఢిల్లీ, జులై 17:క్యూఆర్ కోడ్ లు, ముఖ గుర్తింపు తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టనున్నట్టు ఢిల్లీ ప్రభుత్వ అధికారులు శుక్రవారం తెలిపారు. దీనివల్ల నకిలీ రేషన్ కార్డులు, డూప్లికేట్ ఎంట్రీలు, బ్లాక్ మార్కెటింగ్, సబ్సిడీ ఆహార ధాన్యాల దారి మళ్లింపులను అరికట్టి ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా మారుతుందని అన్నారు. స్మార్ట్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ను ఢిల్లీ అంతటా అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని వెల్లడించారు.

దీని ద్వారా లబ్ధిదారులు తమ రేషన్ ఎప్పుడు విడుదలైంది, ఏ చౌకధరల దుకాణానికి చేరింది, ఎప్పుడు పంపిణీ చేస్తారు అనే విషయాలు తెలుసుకోగలుగుతారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లోనే అనేక సేవలను పొందవచ్చు. రేషన్ కార్డుదారులు తమ కుటుంబ సభ్యుడి పేరును చేర్చడం, తొలగించడం, కావాల్సిన సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయడం, దరఖాస్తు పూర్తయిందా లేదా వంటివి ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. అంతేకాకుండా సెల్‌ఫోన్‌ల ద్వారా కూడా తమకు కేటాయించిన ఆహార ధాన్యాల రవాణాను పర్యవేక్షించవచ్చు.

ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులను క్యూఆర్ కోడ్, డిజిటల్ ధ్రువీకరణ వంటివి కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులుగా మార్చనున్నారు. రేషన్ కార్డు ప్రామాణికతను తనిఖీ చేయడానికి, నకిలీ,డూప్లికేట్ తదితర విషయాలను గుర్తించడానికి ఈ క్యూఆర్ కోడ్ ద్వారా అధికారులకు సాధ్యమవుతంది. కొంతమంది రేషన్ కార్డు లబ్ధిదారుల వేలిముద్రలు బయోమెట్రిక్ పరికరాలపై సరిగ్గా సరిపోలవు. అలాంటివారి కోసం ముఖ గుర్తింపు టెక్నాలజీని ప్రవేశపెట్టనున్నారు.ఢిల్లీ ప్రభుత్వం ఈ స్మార్ట్ రేషన్ కార్డు వ్యవస్థ కోసం 16 మంది సభ్యులతో కూడిన 'యూజర్ యాక్సప్టెన్స్ టెస్టింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో 13 జిల్లాలకు చెందిన అసిస్టెంట్ కమిషనర్లు, ఫుడ్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు, టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఉన్నారు.

## కారుణ్య నియామకంతో ఆర్థిక భరోసా : జడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి



ఖమ్మం, జులై 17:విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న కారుణ్య నియామక పథకం ఆర్థిక భరోసాను కల్పిస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కారుణ్య నియామకం కింద ఇద్దరు అర్హులైన అభ్యర్థులకు కార్యాలయ సహాయకులుగా (ఆఫీస్ సబార్డినేట్లు) నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు డీ సీఈఓతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసి, నియామకం పొందిన అభ్యర్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దేవేందర్, సంఘ సభ్యుడు విజయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కీసర ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు అక్కడికక్కడే మృతి

మేడ్చల్-మల్కాజిగిరి, జులై 17: జిల్లాలోని కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈరోజు(శుక్రవారం) తెల్లవారుజామున ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపక్కన నిలిపి ఉన్న ట్రాలీ ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు రాములు (60), రషీద్ (40)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే కీసర పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతులిద్దరూ మెదక్ జిల్లా వాసులుగా తెలుస్తోంది.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన అనంతరం గుర్తుతెలియని వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నాగోబా దేవస్థానం ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం : కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



ఆదిలాబాద్, జులై 17:ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా దేవాలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , కమిషన్ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా మెస్రం వంశీయులు నాగోబా దేవాలయ చరిత్ర, మెస్రం వంశీయుల సంప్రదాయాలు, నాగోబా జాతర విశిష్టత, గిరిజనుల ఆచార వ్యవహారాల గురించి వివరించారు.

చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నాగోబా దేవాలయం తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. నాగోబా జాతర దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతికి ప్రతిబింబమని, గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే గొప్ప వారసత్వమని పేర్కొన్నారు.

గిరిజన సమాజం తమ మూలాలను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.కమిషన్ సభ్యులు ఆలయ పరిసరాలను పరిశీలించి, దేవాలయ విశిష్టత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యులు, మెస్రం వంశీయుల పెద్దలు, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.